గొర్రెను చంపిన కొండచిలువ

నవతెలంగాణ - చిన్నకోడూరు

మేతకోసం అడవిలోకి వెళ్లిన మందలోని గొర్రెను కొండచిలువ చుట్టుకొని ప్రాణాలు తీసిన సంఘటన మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారుడు యథావిధిగా గొర్రెలు మేపుకోవడానికి సికింద్లాపూర్ గ్రామ శివారులోని అడవిలోకి తీసుకెళ్లారు. మందలోని ఒక గొర్రెను కొండచిలువ చుట్టుకోగా ప్రాణాలు కోల్పోయింది. భయంతో గొర్రెలకాపరి అరుపులు, కేకలు వేయడంతో రైతులు వచ్చి కొండచిలువను చంపేశారు.



నవతెలంగాణ

1



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం 22 ఫిబ్రవరి 2023

నిరుపేదలకు సీఎం సహాయనిధితో లబ్ధి

నవతెలంగాణ-రాయపోల్



బడుగు బలహీనవర్గాల నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధితో లబ్ది చేకూరుతుందని, ఈ పథకాన్ని పేద ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షులు మాదాస్ వెంకట్ గౌడ్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్ గ్రామంలో కన్నయ్యకు రూ.57 వేలు, నర్సింలుకు రూ.28 వేలు, సత్తయ్యకు రూ.27 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మంకీడి స్వామి, మండల ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్, కృష్ణ, బూత్ అధ్యక్షులు శ్రీను, బాలమల్లు, వెంకట్ గౌడ్, నాయకులు కుమార్, రాజు, స్వామి, మల్లేశం, కుమార్, రాజు, రాములు, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో పది జీపీఏ సాధించాలి



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంతో పాటు మండలంలోని వెంకటేశ్వరపల్లి, వింజపల్లి, రాంచంద్రాపూర్, తంగళ్ళపల్లి కెజీబీవీ పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మాణంలో ఉన్న నూతన తరగతిగది భవనాలను ఆయన పరిశీలించారు. మన ఊరు-మనబడి కార్యక్రమం కింద నిర్మిస్తున్న మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్స్, మైనర్ అండ్ మేజర్ రిపేర్‌లను పరిశీలించి, పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని రాణించేలా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ 10 జీపీఏ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తొగిటి సత్యనారాయణ కూతురు తోగిటి స్నిగ్ధ తంగళ్ళపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవడంపై అభినందించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ



నవతెలంగాణ-చేర్యాల

కొద్దిరోజుల క్రితం చేర్యాల సీఐగా బాధ్యతలు స్వీకరించిన పి.సత్యనారాయణరెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎన్.శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చేర్యాల పోలీస్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

సపోర్ట్‌పర్సన్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోండి

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట భరోసా సెంటర్‌లో కాంట్రాక్టు బేస్ కింద సపోర్ట్ పర్సన్ ఉద్యోగానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సీపీ ఎన్.శ్వేత తెలిపారు. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో రెండు సంవత్సరాల ఎక్స్‌పీరియన్స్ కలిగి ఉండి, 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగినవారు అర్హులన్నారు. ఈ నెల 28న సాయంత్రం 5 గంటల లోపు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ కాపీలను సిద్దిపేట వన్‌టౌన్ ఆవరణలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దగ్గరకు అందజేయాలని సూచించారు. ఈ నియామకం ఒక సంవత్సరం మాత్రమే చెల్లుబాటు అవుతుందని, మరిన్ని వివరాల కోసం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ను 9440795364 నెంబర్ లో సంప్రదించాలని ఆమె కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తికి 12 రోజుల జైలు శిక్ష

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ పోలీస్ విధులను అడ్డుకున్న వ్యక్తికి సిద్దిపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.రమేష్ బాబు 12 రోజుల జైలు శిక్ష విధించినట్లు సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండవెల్లి గ్రామానికి చెందిన గద్దల కుమారస్వామి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కరెంట్ టవర్ పైకి ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించి, హల్చల్ చేయడంతో పాటు, అతన్ని వారించిన పోలీసులను దుర్భాషలాడుతూ వారి విధులను అడ్డుకున్నట్లు తెలిపారు. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా అతడికి 12 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. పోలీసుల విధులను అడ్డుకునేలా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఎవరు ప్రవర్తించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బీఈడీ సీటు ఇప్పిస్తానని యువతిపై ఉపాధ్యాయుడి అఘాయిత్యం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



నవ తెలంగాణ-మిరుదొడ్డి

అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లిలో దారుణం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన ఓ యువతిపై ఉపాధ్యాయుడు లైంగిక దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు, సీఐ మున్నూరు కృష్ణ కథనం ప్రకారం... తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతికి దుబ్బాకలోని బీఈడీ కళాశాలలో సీటు ఇప్పిస్తానని రామాయంపేటకు చెందిన ఉపాధ్యాయుడు ఎల్లం ఆమె నమ్మించి మోసం చేశాడు. ఆమెపై కొంతకాలంగా ఎల్లం లైంగిక దాడి చేయడంతో గర్భందాల్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఫోక్సో చట్టం 376, 420 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఎల్లంకు పెళ్లి అయింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఖదీర్‌ఖాన్ మృతిపై హైకోర్టు సీరియస్

- సుమోటాగా కేసు నమోదు
- ఘటనపై వివరణ ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- కొనసాగుతున్న పోలీసుల శాఖాపరమైన విచారణ



నవతెలంగాణ-మెదక్ రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఖదీర్‌ఖాన్(37) మృతి కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఖదీర్‌ఖాన్ మృతిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని సీఎస్ శాంతికుమారి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, మెదక్ ఎస్పీ, మెదక్ డీఎస్పీ, ఎస్ హెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేసింది. మెదక్ పోలీసుల దెబ్బలకు తట్టుకోలేక మెదక్ పట్టణానికి చెందిన ఖదీర్‌ఖాన్ మృతి చెందినట్లు పలు మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ కేసును హైకోర్టు సుమోటోగా తీసుకుంది. కోర్టులో హాజరుపర్చిన 14 రోజులకు ఖదీర్‌ఖాన్ మరణించారని అదనపు ఏజీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఖదీర్‌ఖాన్ మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్పష్టం చేసింది. మెదక్‌లో జనవరి 27న జరిగిన ఓ గొలుసు దొంగతనం కేసులో ఖదీర్‌ఖాన్‌ను అనుమానితుడిగా భావించిన పోలీసులు, జనవరి 29న హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని మెదక్‌కు తరలించి ఐదు రోజులపాటు కస్టడీలో ఉంచుకొని విచక్షణారహితంగా చితకబాది భార్యకు అప్పగించారు. ఖదీర్‌ఖాన్ ఆస్పత్రికి వెళితే అసలు విషయం బయటపడుతుందని భావించిన పోలీసులు అతన్ని ఇంట్లోనే ఉంచి మాత్రలు వేయాలని సూచించడం చర్చనీయాంశమైంది. ఖదీర్‌ఖాన్ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కొంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఫిబ్రవరి 16న ఖదీర్‌ఖాన్ మృతి చెందాడు. మెదక్ పట్టణ పోలీసులు చిత్రహింసలకు గురిచేసి, తీవ్రంగా కొట్టడం వల్లే ఖదీర్‌ఖాన్ మృతి చెందాడని అతడి కుటుంబీకులు ఫిబ్రవరి 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నతాధికారులు బాధ్యులైన సీఐ, ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. తాజాగా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా హైకోర్టు సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. తదుపరి విచారణ మార్చి 14కు వాయిదా వేసింది.

కొనసాగుతున్న పోలీసు శాఖాపరమైన విచారణ

ఖదీర్‌ఖాన్ మృతిపై పోలీసు ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించిన విషయం విదితమే. శాఖాపరంగా మెదక్ పోలీస్‌స్టేషన్‌లో ఏం జరిగిందనే దానిపై సమగ్ర విచారణ జరుగుతోంది. ఇప్పటికే విచారణ అధికారులు మెదక్‌లో పర్యటించారు. మృతిడి భార్య సిద్దేశ్వరితో పాటు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఖదీర్‌ఖాన్ సెల్‌ఫోన్ సిగ్నల్‌పై ఆరా తీస్తున్నారు. జనవరి 27న దొంగతనం జరిగిన రోజున ఖదీర్‌ఖాన్ ఏ ప్రాంతంలో ఉన్నాడనే విషయాన్ని అతని సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే సీఐ మధుతో పాటు ఎస్ఐ రాజశేఖర్, ఇతరు కానిస్టేబుల్స్ ప్రశాంత్, పవన్‌ను సస్పెండ్ చేశారు.

విఫలమైన రాజీ ప్రయత్నం

ఖదీర్‌ఖాన్ మృతి సంఘటనపై కేసు నమోదు చేసి విచారించాలని, అతన్ని కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిద్దేశ్వరి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదును స్వీకరించిన పిదప రాత్రివేళ ఆమెతో రాజీ కోసం ప్రత్నాలు చేశారు. ఇద్దరు ముగ్గురు పెద్ద మనుషులతో పాటు డీఎస్పీ సమక్షంలోనే రూ.20 లక్షలు ఇచ్చేట్లు రాజీ కుదిర్చుకున్నారు. సీరియస్ సెక్షన్స్ కాకుండా పిటీ కేసు నమోదు చేసేలా చూసేందుకు ప్రయత్నించారు. ఆ రోజున పత్రికల్లో వార్తలు రావడంతో రాజీ ప్రయత్నం బెడిసికొట్టింది.

పరిపాటిగా మారిన పోలీసుల దాష్టీకం

పోలీసుల దాష్టీకానికి అనేక మంది బలవుతున్నారు. గతంలోనూ మెదక్ దాయర వీధికి చెందిన నీల రాము భార్య సంధ్య. అతనికి ఒక కూతురు ఉంది. వీరి ఇంటి పక్కన పోలీస్ కానిస్టేబుల్‌కు ప్లాట్ ఉంది. ఇరువురి మధ్య భూమి వివాదం నెలకొంది. ఇరురి మధ్య ఘర్షణ కూడా జరిగింది. రాము ధైర్యానికి జంకిన పోలీస్ కానిస్టేబుల్ తన ఇంట్లో ఓ ఫంక్షన్‌కు పిలిచి మద్యం తాగించాడు. అక్కడ గొడవ జరిగే సరికి రాముపై కానిస్టేబుల్ కేసు పెట్టారు. దీంతో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో పెట్టి దారుణంగా కొట్టారు. చిత్రహింసలకు గురి చేశారు. అతనిపై కేసు కావడంతో సబ్‌జైల్‌కు పంపారు. పోలీసులు కొట్టిన దెబ్బలతోనే జైలుకు పంపిన మూడు రోజుల్లోనే రాము చనిపోయాడు. ఆ సంఘటనలపై జైలు అధికారులు మాత్రం పిట్స్ వచ్చి చనిపోయినట్లు చెప్పారు. వాస్తవంగా అయితే పోలీసులు కొట్టిన దెబ్బలతోనే రాము మరణించినప్పటికీ ఎలాంటి విచారణ చేయలేదు. ఇలా వివిధ కేసుల విచారణ పేరిట పట్టుకొచ్చి కొట్టడం పోలీసులకు పరిపాటిగా మారింది. పాపన్నపేట మండలం గాంధర్‌పల్లికి చెందిన ఓ కూలీ బోరు మోటార్ల వద్ద వైరు దొంగలించాడనే నేపంతో గ్రామస్తులు కొట్టిన దెబ్బలతో అతను చనిపోయాడు. ఈ కేసులో మెదక్ రూరల్ పోలీలు రాజీకుదిర్చారు. నామమాత్రంగా కేసు పెట్టి కోర్టుకు బైండోవర్ చేశారు.

సిద్దిపేట ప్రజలకు మంచినీటి మణిహారం







- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- మిషన్ భగీరథ సిద్దిపేట రింగుమెయిన్ పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు

నవ తెలంగాణ-సిద్దిపేట

'పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా సిద్దిపేటకు మంచినీటి మణిహారం తెచ్చినట్లు రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాళ్లకుంట కాలనీలో మిషన్ భగీరథ సిద్దిపేట రింగు మెయిన్ పైపులైన్ నిర్మాణ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుద్ధమైన తాగునీటి కోసం మంచి కార్యక్రమం చేసుకుంటున్నామని, సిద్దిపేట పట్టణం చుట్టూ 18 కిలోమీటర్ల మేర రూ.32 కోట్లతో రింగుమెయిన్ పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఎల్ఎండీ నుంచి మల్లన్న సాగర్, మిషన్ భగీరథ గ్రామీణం నుంచి ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలుగకుండా నిరాటంకంగా సరఫరా చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. పట్టణంలో రూ.300 కోట్లతో యూజీడీ పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కాళ్లకుంట కాలనీ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జూన్ నెలాఖరులోగా సిద్దిపేటలో వెయ్యి పడకల ఆసుపత్రి పూర్తి చేసుకుని వినియోగంలో తెచ్చి వైద్య సేవలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మీ ఆరోగ్యమే.. మా ఆరోగ్యం

నవ తెలంగాణ - సిద్దిపేట

మీ ఆరోగ్యమే.. మా ఆరోగ్యమని, ఈ రుతుప్రేమ కార్యక్రమం ద్వారా మీకు ఆరోగ్యం, సౌకర్యం, డబ్బులు ఆదా, పర్యావరణ హితం కలిగి ఉందని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. విపంచి ఆడిటోరియంలో మహిళా కళాకారులకు, కవయిత్రులు, గాయకులు, డ్యాన్సర్స్, యాక్టర్స్, యాంకర్స్, చిత్రకారులు, క్రీడాకారులకు రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మంత్రి మాట్లాడుతూ శానిటరీ ప్యాడ్స్ వినియోగ రహిత సిద్దిపేట మన లక్ష్యంగా ఈ రుతుప్రేమ చేపట్టినట్లు తెలిపారు. రుతుప్రేమపై కేరళ ప్రభుత్వం రూ.7 కోట్ల బడ్జెట్లో ప్రవేశ పెట్టిందని, భారత దేశంలో తొలిసారి తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా రుతుప్రేమను క్షేత్రస్థాయిలో ఆచరణలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు మేలు చేయడమే కాకుండా పర్యావరణ హితం కలిగిన ఈ రుతుప్రేమ కార్యక్రమాన్ని పది గొంతుకలై విజయవంతం చేయాలని తెలిపారు. పలు రంగాలకు చెందిన ప్రముఖులను శాలువా, షీల్డులతో మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డాక్టర్ శాంతి, బీసీ సంక్షేమశాఖ సరోజ, డీపీఓ దేవకి, ఇతర జిల్లా మహిళా అధికారులు, వివిధ రంగాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

'బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని రైతుల పొలాల వద్ద మీటర్లు పెట్టనందుకే రాష్ట్రానికి రావాల్సిన రూ.30 వేల కోట్ల పైకాన్ని ఆపివేసింది. బీజేపీ మాటలను సీఎం కేసీఆర్ ఒకవేళ ఒప్పుకుంటే నేడు తెలంగాణ రైతాంగం ప్రమాదంలో పడేది. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి' అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని నర్లెంగడ్డ గ్రామంలో మంగళవారం రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య మంత్రి హరీశ్ రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పాలత, ఎంపీటీసీ మమత, ఏఎంసీ చైర్పర్సన్, పీఏసీఎస్ చైర్మన్, ఆత్మకమిటీ చైర్మన్ నలిమే భాస్కరచారి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్యతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో యాసంగిలో భూములు పడావు పడేవన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతుల పొలాల్లోకి నీళ్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో బోర్లు వేస్తే చుక్కనీరురాని పరిస్థితి ఉండేదన్నారు. నేడు స్వరాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కాల్వలు, వాగులు నీటితో నిండి మండుటెండల్లో పారుతున్నాయని వివరించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల బాగోగుల గురించి పని చేసే పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. రామలింగారెడ్డి మరణానంతరం జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పి గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే ఏం చేశారో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. అంతకుముందు నరేండ్లగడ్డ గ్రామంలో మహిళా భవనానికి రూ.10 లక్షలు, ముదిరాజ్ భవనానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు, ఉగాది పండుగ తర్వాత ఇళ్ళు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇవ్వడంపై గ్రామస్తుల తరపున ఎంపీ ఆర్థిక మంత్రికి, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శశిధర్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

భారత స్వాతంత్ర్య సమరయోధుల్లో అగ్రశ్రేణికి చెందిన వారిలో భగత్‌సింగ్ ఒకరిని, దేశం కోసం నూనూగు మీసాల వయసులో ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని, ఆయన స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. రెడ్‌బుక్‌డే సందర్భంగా సిద్దిపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో భారత విప్లవ కెరటం భగత్ సింగ్ పుస్తక పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పీడిత ప్రజల విముక్తి కోసం ఉద్యమించారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల్ని సంఘటితపరిచారన్నారు. నేడు సమాజంలో మతతత్వ ఫాసిస్టు శక్తుల ఆలోచనలు ప్రబలుతున్న సందర్భంలో స్వాతంత్ర్య సమరయోధులు కోరుకున్న సమాజం నిర్మాణం జరగకపోగా, ఏ రకమైన స్వాతంత్రోద్యమ వారసత్వం లేని మతోన్మాద శక్తులు కొందరు స్వాతంత్ర్య సమరయోధులను తమకనుకూలంగా వారి ముద్ర వేయించుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. అబద్దాలతో, అసత్యాలతో చరిత్ర నిర్మించలేరన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, నాయకులు జాలిగపు శిరీష, చల్లారపు తిరుపతిరెడ్డి, మామిడాల కనకయ్య,చెంద్రారెడ్డి, కర్రోళ్ల నవీన్, సంతోష్ యాదగిరి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలి

నవతెలంగాణ-చేర్యాల: భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాద కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రెడ్‌బుక్‌డే సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో భారత విప్లవ



కెరటం భగత్‌సింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించి అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వెంకటమావో మాట్లాడుతూ కమ్యూనిస్టు కార్యకర్తలందరూ భగత్‌సింగ్ పుస్తకాన్ని అధ్యయనం చేసి ఆయన కలలుగన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యం, జన విముక్తి సాధించాలని తెలిపారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. భారత స్వాతంత్ర్య సమరయోధుల్లోనూ విప్లవకారులు, సోషలిస్టులలోనూ అగ్రశ్రేణికి చెందిన వారిలో భగత్ సింగ్ ఒకరన్నారు. మనదేశ మొట్టమొదటి మార్క్సిస్టు సిద్ధాంత ఆలోచనాపరులలో భగత్‌సింగ్ ఒకరని, నేడు మూఢవిశ్వాసపరులు, మతోన్మాదులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అక్రమంగా భగత్‌సింగ్ పేరును ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, నాగపురి కనకయ్య, కత్తుల భాస్కర్ రెడ్డి, పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, గంధాల బాలు, రేపాక కుమార్, ఎండి.అజ్గర్, బోయిని మల్లేశం, కనకయ్య, ఇప్పకాయల శోభ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ కార్యదర్శులు దేవులపల్లి యాదగిరి, గంప మహేందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సూర్య వర్మ టీపీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రంలు ధీమా వ్యక్తం చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తప్పేట శంకర్ ఆధ్వర్యంలో మైసంపల్లి గ్రామంలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం ప్రజావ్యతిరేక పాలనా సాగిస్తోందన్నారు. కేసీఆర్ తెచ్చిన కొన్ని వ్యక్తిగత పథకాలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు,మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, సిద్దిపేట, నారాయణ రావు పేట్ మండల అధ్యక్షులు భిక్షపతి, రామచంద్రం, నంగునూరు మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదగిరి,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రంగు అశోక్, గాండ్ల రమేష్, నాయకులు,సాదుల పవన్, అనరాజు నాగరాజు, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాగుల కనకయ్య, రాగుల కృష్ణ, దాసరి కిషన్ జంగిటి శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి,



గోపాల్ రెడ్డి, సతీష్ రెడ్డి,గట్టు కిరణ్, స్వామి,కృష్ణ, గంధమల్ల శ్రీకాంత్,నర్సింలు,రాజు,కనకయ్య పాల్గొన్నారు,

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-కొండపాక

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నరసయ్య అన్నా రు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర నాయకులు చేస్తున్న పాదయాత్రకు వారు సంఘీభావం తెలిపారు. మంగళ వారం కొండపాక మండలం వెలికట్ట చౌరస్తా నుంచి దుద్దెడ అంబేద్కర్ సర్కిల్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2,500 మంది గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై, కారోబార్, బిల్ కలెక్టర్లు, ఆఫీస్ నిర్వహణ తదితర పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు బర్మ కొమురయ్య,మండల కార్యదర్శి జాలిగామ ప్రభాకర్, కార్మికులు పల్లె శ్రీనివాస్,ఎల్లయ్య,దబ్బెట సుధాకర్,గొడుగు నారాయణ,నీరటి కలవ్వ, లచ్చవ్వ,మల్లవ్వ,వెంకటవ్వ, మల్లేశం, రాజు,తలారి ఐలయ్య,నాగవ్వ, పాల్గొన్నారు

దృష్టిలోప నివారణకే కంటి వెలుగు

నవ తెలంగాణ-రాయపోల్



రాష్ట్ర ప్రజల దృష్టిలోపం నివారించడానికే కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారని ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామ్‌సాగర్ గ్రామంలో రెండో విడత పల్లె వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన కంటి చూపు ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా గ్రామాలలో శిబిరాలు నిర్వహించి కంటి వెలుగు కార్యక్రమంలో కళ్లద్దాలు, మందులు అందిస్తారని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాలలో చేపట్టడం జరుగుతుందని, 18 సంవత్సరాలు పైబడి వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, గ్రామ సర్పంచ్ కొండారి సంధ్యారాణి గణేష్, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు బృహత్తర కార్యక్రమం

నవతెలంగాణ-మర్కుక్



కంటి వెలుగు కార్యక్రమం బృహత్తర కార్యక్రమని, పట్టణాలకు వచ్చి కంటి పరీక్షలు నిర్వహించుకునే స్థోమత లేని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సువర్ణావకాశమని ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మర్కుక్ మండలంలోని గణేష్‌పల్లి గ్రామంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, ఎంపీపీ మర్కుక్ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, సర్పంచ్ మెతుకు మంజుల శ్రీరాములు, ఎంపీటీసీ గోలి నరేందర్‌తో కలిసి కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటివెలుగు క్యాంపులో నిబంధనల మేరకు నాణ్యత ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు నిర్వహించుకునేలా ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డా.ఆశాజ్యోతి, అప్తామలిస్ట్ వికాస్, డీఈవో గణేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, రవి, పంచాయతీ కార్యదర్శి వాణి, ఉపసర్పంచ్ మహేష్, నాయకులు నర్సింలు తదితరులున్నారు.

కమ్యూనిటీ భవనాలకు ఎంపీ శంకుస్థాపన

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



దుబ్బాక మండల పరిధిలోని పరశురాంనగర్, అచ్చుమాయపల్లి, కమ్మర్‌పల్లి గ్రామంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. తొలుత మెదక్ ఎంపీ పరశురాంనగర్ గ్రామంలో బీఆర్ ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ముదిరాజ్ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. తదనంతరం అచ్చుమాయ పల్లి గ్రామంలో మన ఊరు - మన బడి పథకం ద్వారా జరుగుతున్న పాఠశాల పనులను పరిశీలించి యాదవ సంఘం ,ఎస్సీ కమ్యూనిటీ భవన కాంపౌండ్ వాల్, ముదిరాజ్ ఫంక్షన్ హాల్, సీసీరోడ్లకు ఎంపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పరశురాం నగర్, కమ్మర్పల్లి, అచ్చుమాయపల్లి గ్రామాల సర్పంచ్లు ఎంపీటీసీ రాంరెడ్డి ఉపసర్పంచ్ పర్స దేవరాజ్ ,పాలకవర్గం, వివిధ కులసంఘాల నాయకులు ఉన్నారు. దుబ్బాక మండల అచ్చుమైపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మంద లక్ష్మారెడ్డి భార్య, మంద నర్సింహరెడ్డి, సంపతి యెల్లయ్య, సంపతి పర్శారాములు కుటుంబాలను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మద్దికుంట దేవయ్య వల్ల తండ్రి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-తొగుట



బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. మంగళవారం ఏసీపీ మాట్లాడుతూ తొగుట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రౌడీషీటర్ మన్నె బాగయ్య సత్ప్రవర్తనపై గత సంవత్సరం జూన్ జూన్ 17న తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ మధ్య కాలంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మన్నె బాగయ్య నేరం చేశాడన్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు సమాచారం అందించామన్నారు. విచారణ జరిపిన తహసీల్దార్ నిబంధనలు ఉల్లంఘించిన రౌడీ షీటర్‌కు రూ.50 వేల జరిమానా విధించారని తెలిపారు.

రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ధరణి ఆపరేటర్

నవ తెలంగాణ-కౌడిపల్లి



రిజిస్ట్రేషన్ చేయాలంటే లంచం ఇవ్వాల్సిందే.. లేదంటే రిజిస్ట్రేషన్ కాదని ధరణి ఆపరేటర్ వేణురెడ్డి రైతును డిమాండ్ చేశారు. కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నీరుడి పోచయ్య సర్వేనెంబర్ 357 /ఊ2లో అదే గ్రామానికి చెందిన పానుగంటి సత్తమ్మ వద్ద 20 గుంటలు అగ్రిమెంట్ చేసుకున్నాడు. సమయానికి డబ్బులు లేక పోచయ్య అగ్రిమెంట్పై మరొకరికి 10 గుంటలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. మిగతా 10 గుంటలు పోచయ్య పేరుమీద చేసుకుందామని కౌడిపల్లిలోని ధరణి ఆపరేటర్ వేణురెడ్డిని రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ వివరాల కోసం హెల్ప్ అడిగాడు. దీంతో ఆపరేటర్ వేణురెడ్డి రూ.20 వేల లంచం ఇస్తేనే మీ 10 గుంటలు రిజిస్ట్రేషన్ అవుతది లేదంటే కాదని చెప్పాడు. మీ సేవలో స్లాట్ బుక్ కోసం అమౌంట్ కట్టుకొని రూ.20 వేలు ఇవ్వాలని ధరణి ఆపరేటర్ వేణురెడ్డి డిమాండ్ చేశారు. రైతు నీరుడి పోచయ్య రూ.20 వేల లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కంప్లైంట్ రిసీవ్ చేసుకున్న అధికారులు ఈరోజు వరకు పోచయ్య డబ్బులు అరెంజ్ చేసుకున్నాడు. డబ్బులు తీసుకుని ఆపరేటర్ వద్దకు వచ్చి మీరు అడిగిన రూ.20 వేలు తెచ్చానని చెప్పాడు. వేణురెడ్డి ఫ్రెండ్ కేతావత్ రాజుకు డబ్బులు ఇవ్వాలని తెలిపారు. డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారని డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఇద్దరిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. గవర్నమెంట్ సర్వెంట్లు అక్రమాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వాలని కోరారు.

మెదక్ చర్చిలో బీఆర్ఎస్ నాయకుల ప్రత్యేక ప్రార్ధనలు



నవతెలంగాణ-సదాశివపేట

తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆరోగ్యం కుదుటపడి డిశ్చార్జ్ అయినందుకు.. మండల ఎస్సీ సెల్ పార్టీ బేగరి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మెదక్ చర్చిలో మంగళవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. డాక్టర్ల సూచన మేరకు విశ్రాంతి అవసరం ఉన్నందున.. ఇంకా త్వరగా కోలుకొని సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల కొరకు తొందరగా ప్రజల మధ్యలోకి రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, ఎంపీటీసీ సునీత సుధాకర్, బొబ్బిలిగామా సర్పంచ్ నల్లల్ల కుమార్, ఎంకేపల్లి సర్పంచ్ శేఖర్, రేజింతల్ సర్పంచ్ రమేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ తొంట రాజు, నాయకులు మాణయ్య, రవి,తదితరు నాయకులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-రామచంద్రాపురం

ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను రామచంద్రపురం డివిజన్లో దశలవారీగా నెరవేరుస్తున్నామని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. డివిజన్లోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో మంగళవారం రూ:20 లక్షలతో విలువచేసే సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రపురం డివిజన్లోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రామచంద్రారెడ్డి నగర్ కాలనీ మరియు ఎంఆర్ఎఫ్ కాలనీలో మిగిలి ఉన్న సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ కుమార్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గుప్త, టౌన్ ప్రెసిడెంట్ ఆలూరి గోవింద్, జగన్నాథ్ రెడ్డి, వాసుదేవ్, నాగభూషణం, విట్టల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వీరారెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.



అడవి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పుల్కల్

పొలానికి నీరు పెడుతున్న ఓ వ్యక్తిపై అడవి పంది దాడి చేసి.. తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని బొమ్మరెడ్డి గూడెం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మరెడ్డి గూడెం గ్రామానికి చెందిన బైరు రమేష్ రోజు లాగానే పంట పొలానికి నీరు పారించేందుకు వెళ్లాడు. పొలానికి నీరు పెడుతుండగా ఒక్కసారిగా అడవి పందులు వచ్చి అతన్ని తీవ్రంగా గాయపరిచాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు.. బాధితుడి దగ్గరికి వెళ్లే ప్రయత్నం చేసినప్పటికీ, పందులు ఏమాత్రం వెనక్కి వెళ్లకుండా వారినిక కూడా భయ పెట్టాయి. దీంతో వారు గ్రామస్తులకు సమచారం అందించగా.. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంది రావడంతో పందులు అక్కడినుంచి పారిపోయాయి. కాగా గాయపడిన రమేష్‌ను 108 ద్వారా సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అడవి పందుల బారి నుంచి కాపాడాలని రైతులు, గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా.. వారు స్పందించకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయపడ్డ రైతుకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 28 వరకు నట్టల నివారణ కార్యక్రమం

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో ఈనెల 22 నుంచి 28 వరకు గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమం ఉంటుందని జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.వసంత కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 4828 మండలాల్లో 73 బృందాలు ప్రతీ గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి మూడు లక్షల 91 వేల 470 గొర్రెలకు 1, లక్ష, 93 వేల 383 మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను తాగించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా అంతర, బాహ్య పరాన జీవులు నశించ బడి జీవాల శరీర బరువు పెరగడానికి తోడ్పడుతుందన్నారు. అదేవిధంగా రోగ నిరోధక శక్తి పెంపొంది రక్తహీనత నియంత్రించబడి మరణాల శాతం తగ్గుతుందన్నారు. తద్వారా మాంసం ఉత్పత్తి పెరిగి రైతుకు ఆర్థికంగా లాభం చేకూరుతుందన్నారు. అన్ని మండలాల్లోని పశు వైద్యులు మరియు సిబ్బంది ఆయా గ్రామాల్లోని గొర్రెలు మరియు మేకల పెంపకదారుల వద్దకు వెళ్లి వారి గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులను త్రాగించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గొర్రెల మేకల పెంపకదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



భగీరథ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

నవతెలగాణ-మనూర్

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని.. వారికి చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనూరు మండలంలోని బోరంచే పంప్ హౌస్‌లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. చట్టపరమైన సౌకర్యాలు అమలు కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని కార్మికు లకు న్యాయం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ దగ్గరే మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ ఉన్నప్పటికీ.. కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు కూడా ఇవ్వకుండా కాంట్రాక్టర్లు తక్కువ వేత నం ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ఆ తక్కువ వేతనం కూడా రెగ్యులర్‌గా ఇవ్వట్లేదని.. ఒక్కోసారి ఐదు నెలల వేతనాలు కూడా బకాయిలు ఉంటున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భగీరథ కార్మికులకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయ వాలని.. ఐడి కార్డ్, షూ, టార్చ్, జర్కిన్, పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. లేని యెడల పోరాటం తప్పదని హెచ్చరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రాములు, సీఐటీయూ నారాయ ణఖేడ్ డివిజన్ నాయకులు చిరంజీవి, కార్మికులు సిద్దప్ప, సుదర్శన్, బీరప్ప, వెంకటేష్, ప్రభాకర్, విట్టల్, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడండి

నవతెలంగాణ-సంగారెడ్డి

అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని.. తమ ప్రయివేటు సైన్యంతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. సదరు వ్యక్తుల పై వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఐ(ఎం)సంగారెడ్డి ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని మంగళవారం పార్టీ బృందం పరిశీలించింది. అనంతరం యాదగిరి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో గల రామచంద్రరెడ్డి కాలనీలో ప్రభుత్వ 403 సర్వే నెంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉన్నదన్నారు. అయితే అందులో అంగన్‌వాడీ సెంటర్, కొద్దిగా పార్కు ఏర్పాటు చేసుకోవాలని స్థానిక కాలనీవాసులు నిర్ణయించారన్నారు. కాగా ఆ భూమి మీద అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు కన్నేసి.. భూమిని ఆక్రమించుకున్నారన్నారు. అంతేకాకుండా ప్రయివేటు సైన్యంతో కాలనీ వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నా రన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దగ్గరకి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 403 సర్వే నెంబర్‌లో ప్రభుత్వం భూమి ఉన్నదాన్ని లెక్కలు చెబుత న్నప్పటికీ.. అధికార పార్టీ నాయకులు కొత్త సర్వే నెంబర్ సృష్టించి రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నా అలాంటి నాయకులను బీఆర్ ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉంటే అక్కడ ప్రజలకు పంచి పెడతామన్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిని వెళ్లగొట్టే విధంగా చర్యలు చూసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, అశోక్, మల్లేష్, వీరమని, రజిత, మల్లేష్, వీరేశం, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యాలను సాధించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 28లోగా ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ, బీసి, సంక్షేమ శాఖల అధికారులతో ఆయా శాఖలలో వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి పురోగతి,పెండింగ్,తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక మద్దతు పథకాల కు సంబంధించి వంద శాతం లక్ష్యాన్ని సాధించడానికి ఆయా శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. దళిత బంధు లో ఎవరైనా లబ్ధిదారులకు సంబంధించి పారశల్ గ్రౌండింగ్ పెండింగ్ ఉన్నట్లయితే, వెంటనే గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఎస్సీ నియోజకవర్గాలైన అందోల్, జహీరాబాద్ లలో మినీ డైరీ లక్ష్యం 920 కాగా ఇప్పటివరకు 409 ప్రతిపా దనలు వచ్చాయని, మినీ డైరీ ప్రతిపాదనలను ఎంపీడీఓల నుండి త్వరిత గతిన తెప్పించుకోవాలని, అదేవిధంగా స్వయం ఉపాధి పథకాలలో పెండింగ్ ప్రతిపాదనలను మంజూరీ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారికి సూచించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలలో సబ్సిడీ రిలీజ్ అయిందని, ఈనెల 28లోగా గ్రౌండింగ్ పూర్తి చేయాలని సంబంధిత అధికారికి సూచించారు. స్కాలర్‌షిప్స్‌కు సంబంధించి బీసీ సంక్షేమ అధికారి జగదీష్ ను ఆరా తీశారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి కాన్సెంట్ ఇవ్వడ ంతో పాటు గ్రౌండింగ్ పూర్తిచేసేలా బ్యాంకర్లను ప్రోత్సహి ంచాలని ఎల్డీఎం గోపాల్ రెడ్డిని కోరారు.ఆయా శాఖలలోని ఆర్థిక మద్దతు పథకాల గ్రౌండింగ్ ఈనెల 28 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎల్డిఎం గోపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామా చారి,జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్,జిల్లా యువజన సంక్షేమ అధికారి రామచందర్ రావు, ఎస్టి సంక్షేమ శాఖ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

25న జర్నలిస్టులకు కంటి వెలుగు శిబిరం..

ఈనెల 25న సంగారెడ్డి పట్టణంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా కంటి వెలుగు క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంటోనీ డిగ్రీ కళాశాలలో ఉదయం 9:00 గంటల నుంచి 3:00 గంటల వరకు జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మరియు వారి కుటుంబ సభ్యులతో పాటు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు శిబిరానికి తమ ఐడి కార్డ్, ఆధార్ కార్డుతో వెళ్లి కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ సదవకాశాన్ని పాత్రికేయులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పట్టుదలతో కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారు

నవతెలంగాణ-సదాశివపేట

విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ప్రజాశాంతి పార్టీ అధినేత డాక్టర్ కే.ఏ పాల్ అన్నారు. మంగళవారం సదాశివపేటలోని భవిత జూనియర్ కళాశాలను సందర్శించి.. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలను పక్కనపెట్టి చదువు పైన శ్రద్ధ వహించి చదివినప్పుడే పైకి ఎదుగుతారన్నారు. జ్యోతి, మమత, నవీన్, కళాశాల కరస్పాండెడ్ ప్రిన్సిపాల్ బాలరాజ్, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, రాజు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ గోడ పత్రిక విడుదల

నవతెలంగాణ-హత్నూర

సంగారెడ్డి పట్టణంలో ఈనెల 26న దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన గోడ పత్రికను హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచునూర్, చిక్ మద్దూర్, నస్తీపూర్, కాసాల ఆయా గ్రామాల్లో కురుమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణతో పాటు కురుమ సంఘం భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం ఉంటుందని.. ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో కురుమలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచులు మల్లేశం, గిరికల ఎల్లయ్య, కురుమ సంఘం నాయకులు శ్రీశైలం, బక్క రవి, కృష్ణ కొమర గొల్ల నాగేష్ కురుమ, శ్రీశైలం, చంద్రయ్య, పాండు, సాయిలు, హరిబాబు, మల్లేశం, బాలయ్య, నరసింహులు, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ధరణితో భూ సమస్యల పరిష్కారం
- ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్





నవతెలంగాణ-పుల్కల్

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. పుల్కల్ మండల పరిధి ,లోని పెద్దరెడ్డిపేట గ్రామంలో మంగళవారం నిర్వహిం చిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇనాం భూములకు సంబంధించి 101 మందికి ఎమ్మెల్యే పట్టా సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. రాష్ట్రం ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుం టున్నదన్నారు. గత 50 ఏండ్లుగా పెద్దరెడ్డిపేటలో ఉన్న ఇనాం భూములకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వలేని ప్రభుత్వాలు ప్రజలకు ఉద్ధరించింది ఏమీ లేదన్నారు. ఇక్కడి రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి గ్రామంలో ఉన్న 45 ఎకరాల 14 గుంటల భూమిని 101 మందికి అందజేసి.. అందుకు సంబంధించిన సర్టిఫికేట్లను కూడా అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిని రద్దు చేయాలని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు. ధరణితో రైతులకు సంబంధించిన భూ సమస్యలు వెనువెంటనే పరిష్కారం అవుతున్నాయన్నారు. ఆందోల్‌ను భూ సమస్య లేని నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామ న్నారు. అంతేకా కుండా త్వరలో తాలేల్మ గ్రామంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ గ్రామానికి సాగు నీరు అందిస్తావ న్నారు. అలాగే నిరుపేదలకు ఇళ్లస్థలాలతోపాటు, స్థలం ఉన్నవారికి మూడు లక్షలు అందజేస్తామన్నారు. అంతకువ ముందు ఆయా గ్రామాల్లోని 87 మందికి షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమెల్యే అందజేశారు. జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, ఎంపీపీ చైతన్య విజయ భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మాచర్ల విజయ కుమార్, ఆత్మ కమిటీ మండలాధ్యక్షులు యాదగిరి రెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, పెద్దిరెడ్డిపేట సర్పంచ్ సతీష్ పటేల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్టెపు వీరారెడ్డి, పుల్కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, జోగిపేట ఆర్డీట అంబాదాస్, పుల్కల్ తాసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మధులత, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ..

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పోలీస్ మల్లప్పను ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జెడ్పి చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎంపీపీ చైతన్య విజయభాస్కర్ రెడ్డిలు పెద్దరెడ్డిపేటలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించే విధంగా సంబంధిత వైద్యాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అంగరంగ వైభవంగా కేతకిలో రథోత్సవం



నవతెలంగాణ-ఝరాసంగం

మొగిలి వనంలో కొలువుదీరిన శ్రీ పార్వతి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి నవాహిక బ్రహ్మోత్సవాలు ఏడో రోజైన మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి పార్వతీ సంగమేశ్వర కళ్యాణమనంతరం ఉత్సవమూర్తులను భక్తులు పల్లకిలో మోస్తూ విమాన రథోత్సవంపై ఆలయం నుండి బసవేశ్వర మందిరం వరకు ఊరేగించారు. స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు రంగురంగులతో అలంకరించిన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు రథానికి కట్టిన తాళ్లను పట్టుకుని బసవేశ్వర మందిరం వరకు లాగారు. అక్కడి నుండి మళ్లీ రథాన్ని ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. రథోత్సవ కార్యక్రమానికి భక్తులు అశేషంగా తరలివ చ్చారు. మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన మధ్యాహ్న సమయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ రఘు, జహీరాబాద్ టౌన్,రూరల్ సిఐలు భూపతి, నోముల వెంకటేష్, ఎస్సైలు, రాజేందర్ రెడ్డి, ఏడుకొండలు, వినయ్ కుమార్‌లు ప్రతిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ఉత్సవ కార్యక్ర మంలో ఆలయ ఈవో శశిధర్, పాలకవర్గం చైర్మన్ నీల వెంకటేశం గుప్తా, స్థానిక సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఆల య జూనియర్ అసిస్టెంట్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని.. అలాగే ప్రతీ పరిశ్రమలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాజిపల్లి, గడ్డపోతారం ఇండస్ట్రియల్ ఏరియాలో సంతకల సేకరణ ప్రారంభించి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వర్ణాతీతంగా ఉన్నాయన్నారు. యజమానులు ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయట్లేదని, కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం క్యాంటీన్ కూడా కల్పించడం లేదన్నారు. పని చేయించుకోవడం, లాభాలు గడించడం, దోపిడీ చేయడం తప్ప కనీసం భోజనం, టిఫిను, టీ లాంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. ఇదే పద్ధతి కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అన్ని జీ.వోలను వెంటనే సవరించాలన్నారు. ఈ ప్రాంతంలో గల చాలా పరిశ్రమలలో కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, యూని ఫామ్, క్యాంటీన్, సెలవులు, బోనస్ ఏది సరిగా అమలు చేయడం లేదన్నారు. వలస కార్మికులను బానిసలుగా చూస్తున్నారన్నారు. ఈ పరిస్థితులు మారకపోతే పరిశ్రమల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, వేణు, సురేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేష్, నరసింహ గౌడ్, నాగేశ్వరరావు, సాయిలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సమాచారం ఇవ్వకుండానే డబుల్ ఇండ్ల డ్రా

- అడ్డుకున్న దరఖాస్తుదారులు
- జనాక్రోశంతో రద్దయిన డ్రా
- మళ్లీ విచారణ చేయించాలని డిమాండ్

నవతెలంగాణ-జహీరాబాద్

ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించి అధికారులు డ్రా తీయడాన్ని దరఖాస్తుదారులు అడ్డుకున్నారు. ఈ పద్ధతి సరికాదని.. వెంటనే నిలిపివేయాలని పట్టుబట్టడంతో డ్రా ను అధికారులు నిలిపివేశారు. వివరాల్లోకి వెళ్తే.. హెూతి(కె) పరిధిలో డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఇందులో 660 ఇండ్లకు సంబంధించి బిల్లులు రాలేదనే నెపంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. తాను పనులు చేపట్టలేనని రాత పూర్వకంగా రాసి ఇచ్చాడు. అయితే పూర్తైన వరకు ఇండ్లకు లబ్దిదారులను కేటాయిస్తామని మంగళవారం అధికారులు రంజోల్ రైతు వేదికలో డ్రా పద్దతిని చేపట్టారు. కాగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డ్రా ఎలా తీస్తారని దరఖాస్తుదారులు డ్రా ను అడ్డుకున్నారు. కనీస సౌకర్యాలు లేకుండా ఇళ్లను ఎలా కేటాయిస్తారని మండిపడ్డారు. దీంతో అధికారులు చేసేది ఏం లేక.. డ్రా పద్ధతిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. తిరిగి డ్రా తీస్తామన్నారు. కాగా ఇటీవలే రహ్మత్ నగర్ డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఇండ్లను కేటాయించారని.. ఇక్కడ కూడా అలాంటి పరిస్థితి రావొద్దనే ఉద్దేశంతో డ్రా ను అడ్డుకున్నట్టు దరఖాస్తుదారులు తెలిపారు.



100 సార్లు ధరఖాస్తు చేశాను..
- శశికళ, బాగారెడ్డి పల్లె



డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయంలో 100 సార్లు దరఖాస్తు చేశాను. ఎలాంటి సమాచారం లేకుండా డ్రా ఎలా తీస్తారు.

తహసీల్దార్ కార్యాలయానికి తిరగని రోజు లేదు..
- ఫర్జన



డబుల్ బెడ్ రూం ఇల్లు కోసం తహసీల్దార్ కార్యాల యం చుట్టూ తిరగని రోజు లేదు. అయినప్పటికీ నాకు మం జూరైనట్టు ఫోన్ రాలేదు. ఇంటి అద్దె చెల్లించే స్తోమత లేదు. నాకు డబుల్ బెడ్ రూం ఇల్లును కేటాయించాలి.

విచారణ చేశారు.. సమాచారం ఇయ్యలేదు...
- రాజు



డబుల్ బెడ్ రూం ఇల్లు కోసం దర ఖాస్తు చేసుకున్నాను. విచాణ చేసి నెలలు గడుస్తున్న నేటికీ.. నేను అర్హుడినా కాదా అనే సమాచారం ఇవ్వలేదు. ఇప్పుడు ఉన్న ట్టుండి ఎవరికీ తెలియకుండా డ్రా తీయాలనుకున్నారు.

విచారణ జరిపి త్వరలోనే తిరిగి డ్రా తీస్తాం..
- స్వామి, తహసీల్దార్



గతంలో ఏమి మాకు తెలియదు. నేను ఇటీవలే బదిలీపై ఇక్కడికి వచ్చాను. దరఖాస్తుదారులు చేబుతున్న ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. వారి సుచన మేరకు నడుచుకుంటాం.

ప్రజాగోస-బీజేపీ భరోస

నవతెలంగాణ-సదాశివపేట



ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహిస్తున్నట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వరరావు దేశ్పాండే అన్నారు. మంగళవారం సదాశివపేట్ పట్టణంలో పోలింగ్ బూత్ నెంబర్ 170, 171,172లో నిర్వహించిన శక్తికేంద్ర స్థాయి కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోడీ ప్రజల కోసం ఉచిత బియ్యం, లేని పేదలకు ఇల్లు, యువతకు ఉపాధిగా ముద్ర లోన్, ఉచిత వంటగ్యాస్ వంటి అనేక పథకాలను అందిస్తున్నారని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టిస్తున్నదన్నారు. ప్రజల సంక్షేమం కోసం నరేంద్ర మోడీ నాయకత్వం అవసరమని.. కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం సైనికుల వలె పనిచేయాలన్నారు. సురేందర రాష్ట్ర ఓబిసి కార్యదర్శి, పోచారం రాములు, జిల్లా ఉపాధ్యక్షులు ఓదెలమాణిక్ రావు,పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమాధులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-పుల్కల్

చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామంలో దళితుల సమాధులను ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్యం డిమాండ్ చేశారు. ఘటనా స్థలాన్ని మంగళవారం వారు పరిశీలించి మాట్లాడారు. సుల్తాన్పూర్‌లోని సర్వే నంబర్ 105లో గల ప్రభుత్వ భూమిలో దళితులు అనేక ఏండ్లుగా స్మశాన వాటికగా ఏర్పాటు చేసుకుని సమాధులు కడుతున్నారన్నారు. అయితే ఆ భూమి తమదేనని అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన పెత్తందారి నల్లగండ్ల వెంకట్ రెడ్డి.. దౌర్జన్యంగా ఆ సమాధులను ధ్వంసం చేశారని ఆరోపించారు. దళితులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే దళితుల సమాధులను ధ్వంసం చేసి దళితులను అవమానంగా మాట్లాడారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దురుసుగా మాట్లాడుతున్నారడన్నారు. 1953లో అదే గ్రామానికి చెందిన కొంతమంది దళితులకు లావాని పట్టా సర్టిఫికెట్లను కూడా ఇచ్చారన్నారు. కానీ వారికి రెవెన్యూ అధికారులు పొజిషన్ చూప లేదన్నారు. ఇటీవల అకోల నాందేడ్ జాతీయ రహదారి విస్తరణ కావడంతో.. ఆ విస్తీర్ణంలో కూడా సమాధులు ఉన్న వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందన్నారు. దళితులపై దౌర్జన్యంగా ప్రవర్తించడమే కాకుండా దౌర్జన్యం చేసి సమాధులను ధ్వంసం చేసిన వెంకట్ రెడ్డిని శిక్షించాలన్నారు. అలాగే అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 105లో గల భూమి సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎన్ని ఎకరాలు ఉందనేది తేల్చాలన్నారు. కబ్జాదారు నుంచి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. గతంలో లావాని పట్టాలు ఇచ్చిన వారందరికీ వెంటనే పొజిషన్ చూపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేవీపీఎస్, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) నాయకులు నాగభూషణం, కేవీపీఎస్ మండల కార్యదర్శి గంగారం, ఉపాధ్యక్షులు సుధాకర్, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వ్యాన్, కారు దగ్ధం


- స్తంభించిన రాకపోకలు

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ఓ డీసీఎంలో మంటలు చెలరేగాయి. ఆ డీసీఎంలో కెమికల్ డ్రమ్స్ ఉండడంతో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. దీంతో ఆ వ్యాన్ పక్కనే ఉన్న కారు కూడా మంటల్లో దగ్ధమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం ఉదయం సుమారు 6:30 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై నిలిచి ఉన్న డీసీఎం వ్యాన్ టీఎస్15యూఈ1372 నుంచి షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు కొద్దికొద్దిగా వ్యాపిస్తూ అందులో ఉన్న కెమికల్ డ్రమ్స్‌కి అంటుకోవడంతో.. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పక్కనే ఉన్న బ్రీజా కారుకు సైతం మంటలు వ్యాపించి దగ్ధమైంది. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో చుట్టుపక్కల వెళ్తున్న వాహనదారులు భయభ్రాంతులకు లోనయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఫైర్ ఇంజన్‌ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఈ ప్రమాదంలో ప్రాణం జరగకపోవడంతో.. అందర ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై ఈ ఘటన జరగడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయాన్నే ఉద్యోగాలకు, పాఠశాలలకు, బిజినెస్ పరంగా రాక పోకలు సాగించే వారు గంటలపాటు ట్రాఫిక్‌లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



నవతెలంగాణ
3
మెదక్
బుధవారం 22 ఫిబ్రవరి 2023



చెరువుల అభివృద్ధికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలోని చెరువులకు జలకళను తీసుకురావడంతో పాటు మిషన్ కాకతీయ ద్వార చెరువుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు మెదక్ జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమత శేఖర్‌గౌడ్ దత్తత గ్రామం గౌతోజిగూడ పెద్ద చెరువు మత్తడి నిర్మాణానికి రూ. 4 లక్షలు మంజూరు కాగా మంగళవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, పూల అర్జున్, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్, కార్యదర్శి నందినిలతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దరిపల్లిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నవతెలంగాణ-చిన్న శంకంపేట



మండల పరిధిలోని దరిపల్లి గ్రామంలో యాభై ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పట్లోరి రాజు ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి గ్రామ సర్పంచ్ సిద్ధిరాం రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పచ్ మహిపాల్ రెడ్డి, లింగా రెడ్డి, ఉప సర్పంచ్ మహేశ్, డైరెక్టర్ పాండు, ఇమ్మడి నరేష్, వార్డు సభ్యులు నర్సింలు, ఆంజనేయులు, బాబు, కృష్ణ నాగులు, గోవర్ధన్ రెడ్డి, తదితులు పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటించాలి



నవతెలంగాణ-టేక్మాల్

రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటిస్తే, అధిక దిగుబడితోపాటు క్రిమి కీటకాలు సోకవని ఏడీఏ రాంప్రసాద్ అన్నారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని కాద్లూర్ గ్రామంలో నందు శంకరంపేట్ (అ) ఎడీఏ రాంప్రసాద్ జొన్న పంటను పరిశీలించారు. రైతు వేదికలో పంటల సాగు, వ్యాధులు, మందుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, గ్రామ రైతులు, ఎఈఓ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల జాతర ఆదాయం రూ.59.57 లక్షలు

నవతెలంగాణ -పాపన్నపేట

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా దేవి క్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల హుండీ ఆదాయం రూ.59.57 లక్షలు వచ్చినట్లు చైర్మన్ బాలగౌడ్. ఈవో సార శ్రీనివాస్ వెల్లడించారు . మంగళవారం ఆరు రోజుల హుండీ లెక్కింపు గోకుల్ షెడ్‌లో నిర్వహించగా హుండి ఆదాయం రూ.18,30,133 వచ్చింది. ప్రత్యేక దర్శనాలు. ప్రసాదాల, ఓడిబియ్యం, తాత్కాలిక దుకాణాలు, కేశఖండనంల ద్వారా రూ.41,27,350ల ఆదాయం రాగా, జాతర ఆదాయం రూ.59,57,483 ఆదాయం సమకూరినట్లు సూపరింటెంట్, శివరాజ్, ఇన్స్‌పెక్టర్ రంగారావు వెల్లడించారు. జాతర ఉత్సవాల హుండి లెక్కింపు కార్యక్రమం రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా దేవాదాయ ధర్మాదాయ శాఖ సూరింటెండెంట్ శివరాజ్ పర్యవేక్షించారు. బంగారు, వెండి వస్తువులు మినహా రూ.18,30,133ల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు జాతర ఉత్సవాల్లో భాగంగా వివిధ విక్రయాలు, ప్రత్యేక దర్శనం, కేషఖండనం, ఒడిబియ్యం, తదితర టికెట్ల ద్వారా రూ.41,27,350ల ఆదాయం రాగా, ఇందులో ప్రసాదాల విక్రయాలద్వారా రూ.27,60,400లు, ప్రత్యేక, దర్శనాల ద్వారా రూ.10.68 లక్షలు, ఓడిబియ్యం ద్వారా రూ.62,500లు రాగా, కేశ ఖండనం ద్వారా రూ.92,700లు, తాత్కాలిక దుకాణ సముదాయాలపై రూ.1,43,200ల ఆదాయం ఆలయానికి సమకూరగా వివిధ విక్రయాలు, దర్శనాలు, కేశ ఖండనం తదితరాలతోపాటుహుండి ద్వారా మొత్తం ఆదాయం రూ.59,57,483ల



ఆదాయం దేవాదాయ ధర్మాదాయశాఖాకు వచ్చినట్లు వారు తెలిపారు. డైరెక్టర్లు యాద గౌడ్, మనోహర్, వెంకటేశం సాయిలు, పెంటయ్య, సిద్ధయ్య, నాగభూషణం, శ్రీనివాసరావు, మోహన్ రావు తదితరులు ఉన్నారు.

పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



నవతెలంగాణ-రేగోడు

పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పరిశీలకులు విరాట్ స్వరూప్ అన్నారు. మంగళవారం రేగోడులోని ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. సాయంత్రం వేళలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నప్పుడు స్నాక్స్ అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అంజి బాబు, రమేష్, సిఆర్పి సంతోష్, కంప్యూటర్ ఆపరేటర్ సిద్దు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణకు పెద్ద సంఖ్యలో యువకులు



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మెదక్ పట్టణంలో మంగళవారం చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ సందర్భంగా చిన్నశంకంపేట మండలం ఎస్ కొండాపూర్ గ్రామం నుంచి పెద్ద ఎత్తున యువకులు తరలి వెళ్లారు. మెదక్ పట్టణంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు శ్రీశ్రీశ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చాకలి మహేందర్, జాగ్గారిబాబు, మూడ మహేష్, గొల్ల పర్వతాలు, గొల్ల చిన్న భూపతి, తుడుం మహేష్, గొల్ల శ్రీకాంత్, ఎరుకల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి' పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

మండల విద్యాధికారి నీలకంఠం

నవతెలంగాణ-కొల్చారం



మన ఊరు మనబడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల విద్యాధికారి నీలకంఠం అన్నారు. మంగళవారం కొల్చారం మండలం చిన్న ఘనపూర్, రంగంపేట, ఎనగండ్ల పాఠశాలలను సందర్శించిన ఆయన పాఠశాలలో జరుగుతున్న 'మన ఊరు-మన బడి' పనులను పరిశీలించారు. అందులో ఎలక్ట్రిసిటీ, ఫ్లోరింగ్, కిటికీలు, రన్నింగ్ వాటర్ పనుల నాణ్యతను పరిశీలించారు. వీలయినంత తొందరగా పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కోరారు.

సర్పంచ్, ఎంపీపీలకు సన్మానం

నవతెలంగాణ-చిన్న శంకంపేట



శివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీశ్రీశ్రీ సోమేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ చిరంజీవులును చిన్న శంకరంపేట ఎంపీపీ ఆవుల భాగ్య లక్ష్మి గోపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. సోమేశ్వర స్వామీ ఆశీస్సులు వారిపై ఎల్లప్పుడు ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

మంత్రికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు

మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అమర సేనా రెడ్డి


నవతెలంగాణ-నిజాంపేట



నిజాంపేట మండలం నార్లపూర్ గ్రామ సర్పంచిగా రావిపల్లి అమర సేనా రెడ్డి, 2019లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి మండల ప్రజల ఆకాంక్ష మేరకు గ్రామ అభివృద్ధి కొరకు కాంగ్రెస్‌లో నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరానన్నారు. ఈ సందర్భంగా నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు నిజాంపేట మండలానికి కాలేశ్వరం నీళ్ల మండలానికి తీసుకొస్తామంటేనే పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి మంత్రి హరీశ్‌రావును మెప్పించి మండలానికి నీళ్లు తెప్పించిన మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని ఆయన దీమా వ్యక్తం చేశారు.

శ్రీ సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

నవతెలంగాణ-దౌల్తాబాద్



మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నంత పాఠశాలలో మంగళవారం శ్రీ సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా విద్యార్థులకు ఉదయం రాగి బెల్లంతో తయారుచేసిన అంబలి ని అందజేశారు. ఈ సందర్భంగా సత్య సాయి ట్రస్ట్‌ను ఉద్దేశించి పాఠశాల ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి మాట్లాడారు. పేద పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్న సత్యసాయి ట్రస్ట్‌కు విద్యార్థుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం సిద్దిపేట ప్రాంత పాఠశాలలో ఉచితంగా అందించడం జరిగిందని, ప్రస్తుత సంవత్సరం మన మండలంలో ప్రారంభించినందుకు సంతోషకరమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ అంబలిపైన అపోహలు వద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో మంచి ఫలితాలను సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



పదవ తరగతి పరీక్షలలో మంచి ప్రతిభను కనబరిచి వంద శాతం ఉత్తమ ఫలితాలను సాధించాలని మెదక్ జిల్లా డీఈవో రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మన ఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చెప్పిన సమాధానాలతో డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచాలనే లక్ష్యంతోనే పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వరకు అదనపు తరగతులను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు అదనపు తరగతులను సద్వినియోగం చేసుకుని మంచిగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు సాయంత్రం తరగతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు వెంకటస్వామిగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయాలి

ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలి

నవతెలంగాణ-వెల్దుర్తి



రామయంపేట మాజీ ఎమ్మెల్యే మాసాయిపేట గ్రామ నివాసి అంతి రెడ్డి గారి విట్టల్ రెడ్డి ఇటీవల విక్రయించిన మాసాయిపేట గ్రామ శివారులోని సర్వేనెంబర్ 436, 437 లో గల 4.15 గుంటల భూమి రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దుచేసి మాసాయిపేట మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని మాసాయిపేట అఖిలపక్ష నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు గతంలో యూత్ క్లబ్ పేరిట కేటాయించిన భూమిని యూత్ క్లబ్ అధ్యక్షుడు మాసాయిపేట గ్రామ నివాసి రామాయంపేట మాజీ ఎమ్మెల్యే అంతిరెడ్డి గారి విట్టల్ రెడ్డి పేరుతో రికార్డులో ఉండగా అట్టి భూమిని గ్రామపంచాయతీకి , రెవెన్యూ అధికారులకు, గ్రామ ప్రజలకు తెలియకుండా అక్రమంగా ఒక ప్రైవేటు సంస్థకు విక్రయించారన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమంగా విక్రయించిన భూమి రిజిస్ట్రేషన్ రద్దుచేసి భూమిని మాసాయిపేట మండల అభివృద్ధి నిమిత్తం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట గ్రామ సర్పంచి మధుసూదన్ రెడ్డి, ఉపసర్పంచి ఉదండపురం నాగరాజు , మాజీ సర్పంచి నాగరాజు మాజీ ఎంపీటీసీ అశోక్ పిఎస్సిఎస్ డైరెక్టర్ నర్సింలు ఎమ్మార్పీఎస్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ వార్డు సభ్యులు పవన్ స్వర్గం రాము ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర స్వామి గుడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం కార్పోరేట్ ఆసుపత్రులు నిర్వమిస్తున్న ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని వైద్య సేవలను పొందాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ గ్రామ సర్పంచ్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహిపాల్‌రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందాలని తెలిపారు. వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో హజరై వైద్య సేవలను పొందగా వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గోపాల్‌రెడ్డి, డీన్ శ్రీనివాస్ ఆచార్య, డైరెక్టర్ డాక్టర్ అలీబేగ్, పీఆర్‌వో దుర్గాప్రసాద్‌రెడ్డి, మార్కెటింగ్ సూపర్‌వైజర్ మధు, డాక్టర్లు రియాజ్, ప్రవళిక, పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్ పాషా, వార్డు సభ్యులు, నాయకులు కృష్ణమూర్తి, నర్సింలు, కార్యదర్శి రూపాగౌడ్‌లతో పాటు గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి మాణిక్య రెడ్డి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు కసిరెడ్డి మాణిక్య రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుల్తాన్ పూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో వైద్యం అందే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. గ్రామంలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంలో నాలుగు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక రమేష్, ఎంపిడిఓ శ్రీరామ్, పంచాయతీ సెక్రెటరీ సంధ్య ,ఉప సర్పంచ్ బాలయ్య, వైద్య సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్





ప్రతి ఒక్కరు శివాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని హిందూ సామ్రాజ్య స్థాపనకు పాటుపడాలని చిదానంద ఆశ్రమం భువనేశ్వర్ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 16 ఏళ్ల వయస్సులోనే కాషాయపు పతాకాన్ని ఎగరవేసిన గొప్ప యోధుడు శివాజీ అని కొనియాడారు. శివాజీ జీవిత కాలంలో దక్షిణ భారత దేశంలో హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన రాజ్యం మొగులల రాజ్యం కంటే పెద్దది అని తెలిపారు. భారతదేశాన్ని బలహీనపరిచేందుకు ప్రపంచంలో చాలా దేశాలు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కానీ ఆ దేశాల్లో భూకంపాలు వ్యాధులు కరువులు ఏర్పడి ఆ దేశాలే నాశనం అవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానంలో తీసుకు వస్తుందన్నారు. అందులో ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు హిందూ ధర్మం కోసం దేశం కోసం ప్రాణాలను వదిలిన మహనీయుల చరిత్రలు అన్నారు. వారి చరిత్రను చదివి మీరు కూడా శివాజీ, భగత్ సింగ్‌ల మాదికిగా తయారు కావలసిన అవసరం ఉందన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడు తూ మెదక్ చౌరస్తాలో కాదు భారతదేశ చౌరస్తాలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయం శాశ్వతం కాదు ప్రజల మనసులే శాశ్వతమన్నారు. ప్రజల్లో శాశ్వతంగా ఉండాలంటే హిందూ ధర్మాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతకుముందు మెదక్ వెల్కం బోర్డు నుంచి రాందాస్ చౌరస్తా వరకు భారీ శోభాయాత్రను కొనసాగించారు.



బాలల పరిరక్షణ మండల కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-వెల్దుర్తి



మాసాయిపేట మండల కేంద్రంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమగ్ర బాలల పరిరక్షణ వారి ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ మండల కమిటీని ఏర్పాటు చేశామని ఐసీపీఎస్ మెదక్ కన్వీనర్ శంకర్ గౌడ్ తెలిపారు. ఈ కమిటీలో చైర్మన్ ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, కన్వీనర్‌గా ఐసిడిఎస్ సిడిపిఓ స్వరూప రాణి, సభ్యులుగా ఎంఈఓ యాదగిరి, వీసీపీసీ స్థానిక సర్పంచి మధుసూదన్ రెడ్డి, ఎన్జీవో మండల్ హెల్త్ అధికారి సబ్ ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ గౌడ్, అసిస్టెంట్ లేబర్ అధికారి చిల్డ్రన్ ఆఫ్ విసిపిసి మండల సమైక్య అధ్యక్షులు డీసీపీయూ టీమ్ మెంబర్ యూత్ అసోసియేషన్ ఎంపీటీసీ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి మాట్లాడారు. కమిటీలో ఉన్న వారందరూ కలిసికట్టుగా బాలల హక్కులు పరిరక్షణకు పాటుపడదామన్నారు. వేధింపులు భిక్షాటన కిరాణా దుకాణాల్లో హెూటళ్లలో మగ్గుతున్న బాల్యాలను రక్షించి బాలల హక్కులను పరిరక్షించి దేశ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి , అంగన్వాడి టీచర్లు, మెంబర్లు పాల్గొన్నారు.

ఇంద్రపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు

సీడీపీ నిధుల నుంచి మంజూరు చేసిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ పట్టణంలోని ఇంద్రపురి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 10 లక్షలను ఇంద్రపురి కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఇంద్రపురి కాలనీ వద్ద మునిసిపల్ మాజీ చైర్మన్, ప్రస్తుత వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ మామిళ్ల అంజినేయులు, ఇంద్రపురి కాలనీ అధ్యక్షుడు గోపాల్ రావులతో కలిసి సంబంధిత స్థలంలో కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రపురి కాలనీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. కమ్యూనిటీ హాల్ లేక ఇబ్బందులు ఉన్నాయని కాలనీ పెద్దలు తన దృష్టికి తీసుకురాగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి నిధులు మంజూరు చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు తాడెపు సోములు, సర్పంచులు దేవా గౌడ్, మహిపాల్ రెడ్డి, యామి రెడ్డి, ఉప సర్పంచ్ అజయ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శేఖర్ గౌడ్, కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, కాలనీ ప్రముఖులు జైపాల్ రెడ్డి, నర్సింహారెడ్డి, హన్మంత్ రెడ్డి, సిద్ధిరాములు, స్వామి, రాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ గౌడ్, జయరాములు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూంకుంట

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



మనోహరాబాద్ మండల కేంద్రంలోని అవని గార్డెన్స్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో రెండవ రోజు కళ్యాణమహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు ర్యాకల కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉత్సవాలు మంగళవారం ఉదయం నుంచి కనుల పండగగా జరిగాయి. కళ్యాణోత్సవ కార్యక్రమానికి సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి హజరయ్యారు. ఉదయం కళ్యాణం, పొట్నం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం పెద్ద ఎత్తున మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమానికి మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, నర్సింహ, నాగరాజుగౌడ్, అశోక్‌లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఉద్యోగుల సేవలు అభినందనీయం

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

నవతెలంగాణ-మెదక్ టౌన్

రైతులు పంట పండించిన ధాన్యాన్ని సేకరించడంలో జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సేవలు అభినందనీయమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీఎన్జీవో భవన్లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధాన్యం సేకరణతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి, మత్స్య కార్మికులు, గొర్రెల పెంపకం దారులు, పాల ఉత్పత్తి దారులు, గీత పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికల వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తూ అటు అధికారులు, ఇటు ప్రజల మన్ననలు పొందిన ఘనత సహకార శాఖ ఉద్యోగులకే దక్కుతుందన్నారు. అనంతరం సహకార శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరేళ్ల రామాగౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ఇరిగేషన్ డీఏవో తోట కుమార్ నీలతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు గాండ్ల అనురాధ, కార్యాలయ కార్యదర్శి కోటి రఘునాథరావు, సహకార శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్, రాజేష్, శివకుమార్, దినేష్, పాష తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కె వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ఎంపీపీ దేశెట్టి సిద్దరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సిద్ధ రాములు, బి.ఆర్.ఎస్ నాయకులు దయాకర్, పెంటయ్య, సొసైటీ డైరెక్టర్ మహిపాల్, మెడికల్‌ఆఫీసర్ మార్గదర్శిని, సూపర్వైజర్ శ్యామల, ఆప్టికల్ శ్రీనివాస్, ఎం ఎల్ హెచ్ పి స్వాతి, డాటా ఎంట్రీ ఆపరేటర్ కళ్యాణి, ఏఎన్ఎం గౌరీ, మంజుల, రమ్య ఆశా వర్కర్లు కవిత, సునీత, బాలమణి, పద్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండల కేంద్రంలోని 132 కెవి సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మనోహరాబాద్ విద్యుత్ ఏఈ కృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కృష్ణ కోరారు.



ఇంటి వద్దకే కంటి వెలుగు



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంటి వద్దకే కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో స్థానిక సర్పంచ్ కమలాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ రావు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమలాకర్ రెడ్డి, వెంకటేష్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని మర్మముల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉట్ల అనిల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి గత కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆస్పత్రిలో వైద్యానికి ఖర్చు అయిన విషయాన్ని కుటుంబ సభ్యులు తన దృష్టికి తీసుకురావడంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు ప్రభుత్వం రూ.55 వేలు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కును అనిల్ రెడ్డి సతీమణికి అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడతాల ప్రభాకర్ రెడ్డి, రమేష్, లింగారెడ్డి, విజయకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు

గాగిల్లాపూర్‌లో సుబ్రహ్మణ్యస్వామి ఆరోవార్షికోత్సవం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిలాపూర్ గ్రామంలోని శివాలయంలో ధ్వజస్తంభం నాగదేవత సుబ్రహ్మణ్యస్వామి ఆరవ వార్షికోత్సవాన్ని శివాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో మొదటిసారి శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, ఉపసర్పంచ్ మేక మాధవి గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని సలాక్‌పూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన తరిగొప్పుల ఎల్లయ్య, నల్ల నాగుల కమలమ్మలు మృతి చెందారు. మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి, రేబర్తి పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డిలు పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా తరిగొప్పుల ఎల్లయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరు ప్రతాపరెడ్డి రూ.10 వేలు నల్ల నాగుల కమలమ్మ కుటుంబానికి, రేబర్తి పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ కామెడీ జీవన్ రెడ్డి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బందారం శ్రీనివాస్, నాయకులు కామెడీ రమణారెడ్డి, కాటోజు చారి, కాటోజు సోమయ్య తరిగొప్పుల మల్లయ్య, తరిగొప్పుల సాయిలు, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు

స్వేరోస్ ఫెలోషిప్ దరఖాస్తుల స్వీకరణ

- స్వేరోస్ జిల్లాధ్యక్షుడు బొర్ర సురేశ్ కుమార్ వెల్లడి



నవతెలంగాణ-బెజ్జంకి

డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న పేద సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు చేయూత అందించడానికి స్వేరోస్ ఫెలోషిప్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్వేరోస్ జిల్లాధ్యక్షుడు బొర్ర సురేశ్ కుమార్ మంగళవారం వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడానికి స్వేరోస్ వెబ్ సైట్, నాయకులను సంప్రదించాలని సురేశ్ కుమార్ తెలిపారు.

కల్వర్టు సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్తా

- జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన అన్నదాతలు కల్వర్టు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లానని జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పల్లె చెరువుకు వెళ్లే ఫీడర్ ఛానల్ పై కల్వర్టు అవసరం ఉన్నదన్నారు. వెంటనే స్పందించిన జెడ్పీటీసీ ఈ విషయాన్ని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడైన కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కల్వర్టును నిర్మించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నదాతలు బాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పంజా స్వామి, గోవర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ముత్యంరెడ్డి, బాపురెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ప్రతిభా డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

జాతీయస్థాయిలో జరిగిన హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సెలెక్ట్ అయిన ప్రతిభా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థి ఓగ్గు మోహన్‌ను కళాశాల ప్రిన్సిపల్ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల నిరంతరం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. మోహన్ మాట్లాడుతూ చాలా పేద కుటుంబం నుంచి వచ్చిన తనను కళాశాల ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, పాఠశాల పీఈటీ గోవర్ధన్ రెడ్డి ప్రోత్సహించడంతో తాను ఈ స్థాయికి ఎదిగానని, భవిష్యత్తులో భారతదేశం తరపున ఆడడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. అనంతరం మోహన్‌ను సన్మానించారు.

నష్టపోయిన రైతులకు చెక్కుల పంపిణీ

- తహసీల్దార్ దండు సుజాత



నవతెలంగాణ-దౌల్తాబాద్

కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామం మీదుగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామాల మీదుగా వెళ్లే ప్రాజెక్టు కాలువ కింద భూములు కోల్పోయి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ దండు సుజాత రైతులకు చెక్కులను అందించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. రైతుల త్యాగం గొప్పదన్నారు. రైతుల త్యాగఫలం మూలంగానే తోటి రైతాంగానికి సాగునీరు అందించగలుగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మధు మధుసూదన్, ఇందుప్రియల్ ఎంపీటీసీ వీరమ్మ మల్లేశ్, సర్పంచ్ సుగుణ యాదగిరి, ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటం అద్భుతం

- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్

రామకోటి రామరాజు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా 18 అడుగుల సీఎం కెసిఆర్ చిత్ర పటం 25 కిలోల ఆవాలతో అద్భుత చిత్రం వేశారని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. మంగళవారం రామకోటి రామరాజు అవాలతో చిత్రించిన సీఎం కేసీఆర్ చిత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు భక్తి మార్గం వైపు ప్రజలు మొగ్గు చూపే విధంగా రామకోటి రామ నామాలను లిఖింపజేస్తు తన కళానైపుణ్యంతో ప్రత్యేక సందర్భాల్లో వివిధ చిత్రాలు వేస్తూ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆవాలతో చిత్రించిన సీఎం కేసీఆర్ భారీ చిత్రం అద్భుతం అన్నారు. ఈ కార్యక్రమంలో: కౌన్సిలర్ దుర్గాప్రసాద్, కో అప్షన్ మెంబర్ గంగిశెట్టి రాజు, వార్డు ప్రెసిడెంట్ రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు హరిని, సామాజిక కార్యకర్త సాదిక్ పాషా, నర్సింలు, హరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ సైకిళ్ల వితరణ

నవతెలంగాణ-సిద్దిపేట

స్వల్ప వ్యవధిలోనే రాష్ట్ర, జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ఇద్దరు సైక్లిస్ట్‌లు గిరిమల్ల హర్షవర్ధన్, సురంపల్లీ సుమిత్‌లకు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో స్పోర్ట్స్ సైకిళ్లను అందజేశారు. హుస్నాబాద్‌కు చెందిన హర్షవర్ధన్, సమితులును జిల్లా సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకట నరసయ్య శిక్షణ ప్రోత్సాహంతో పలుమార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. దీంతో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలోని వెల్లో డ్రమ్ సైక్లింగ్ అకాడమీని ఎంపిక చేశారు. ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న సుమిత్, హర్షవర్ధన్‌లకు స్పోర్ట్స్ సైకిల్స్ అనివార్యమైంది. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో క్రీడా స్ఫూర్తితో రూ.1 లక్షా 8 వేల వ్యయం అయ్యే స్పోర్ట్స్ సైకిల్స్ అందించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు మంత్రి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో స్పోర్ట్స్ సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా



అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా క్రీడలు యువజన అభివృద్ధి అధికారి జే. నాగేందర్, బండారు పల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకట నరసయ్య, సంజీవ్, అశోక్, కటం శ్రీను, వెంకటస్వామి, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుపరిశ్రమ ఉత్తమ రైతుకు సన్మానం

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన సామల స్వామిని పట్టు పరిశ్రమ అధికారులు సోమవారం శాలువతో ఘనంగా సన్మానించారు. మునిగడప గ్రామానికి చెందిన సామల స్వామి పట్టు పురుగుల రైతు గత 5 సంవత్సరాలుగా పట్టు పరిశ్రమలో ఉత్తమ దిగుబడిని సాధిస్తూ పలువురు యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టును పండిస్తూ మిగతా రైతులకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా జిల్లా సెరికల్చర్ ఎడి ఇంద్రసేనారెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ యాదవ్, గజ్వేల్ ఏరియా సెరికల్చర్ ఆఫీసర్ మల్లేశం మాట్లాడుతూ యువకులు స్వామిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువకులు నిరుత్సాహం చెందకుండా ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువకులు ఆర్థికంగా ఎదగాలంటే పట్టు పరిశ్రమపై దృష్టి సాధించాలి అని తెలిపారు. నిరుద్యోగ యువతి యువకులకు ఇది మంచి అవకాశం అని తెలిపారు. 30 రోజుల్లో పంట చేతికి వస్తుంది అని



తెలిపారు. సుమారుగా సంవత్సరం కు 10 పంటలు తీసుకోవచ్చు అని అన్నారు. యువకులు ఆర్థికంగా ఎదగడం లక్ష్యం గా ముందుకు సాగాలని తెలిపారు. యువకులు చెడు వ్యసనాలకు లోను కవద్దు అన్నారు . ఈ కార్యక్రమంలో మాందాపూర్ సర్పంచ్ భిక్షపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన ఎంపీపీ



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో సర్పంచ్ భాగ్య ఎల్లం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ గంగాధరి సంధ్య రవీందర్ ప్రారంభించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె సూచించారు. కంటి చికిత్స అవసరం ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉచితంగా చేయిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇప్ప లక్ష్మి పోచయ్య హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగును తనిఖీ చేసిన ఎఎంసీ చైర్‌పర్సన్

మండల పరిధిలోని లింగరాజు పల్లి దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇప్ప లక్ష్మీ పోచయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయరాదని ప్రజలను విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రవేశపెట్టిన ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వాగతించి పేద ప్రజల అంధత్వం నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని ప్రజాప్రతినిధులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మర్కంటి కేత కనకరాజ్, మాజీ సర్పంచ్ పోచయ్య, ఉప సర్పంచ్ సాయి, గ్రామ సచివాలయ అధికారి భరద్వాజ్, బీఆర్ఎస్ నాయకులు ఇప్ప దయాకర్, నర్సింలు, కనకరాజు, రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మాతృ భాష తల్లిపాలవంటిది



నవతెలంగాణ-గజ్వేల్

మాతృభాష తల్లిపాలవంటిదని బాలుర విద్యా సౌధంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.ఎ.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా సుమారు 1652 భాషలున్నాయని అందులో చాలా భాషలు ఈ రోజు వ్యవహారం నుంచి జారిపోతున్నాయన్నారు. విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడడానికి ఆంగ్ల భాషను నేర్చుకున్నా తెలుగు భాషను మర్చిపోవద్దని తెలిపారు. విదేశాల్లోని తెలుగు వారు ఎంతో మంది నేడు తెలుగు భాషను ఎంతో ఇష్టంగా నేర్చుకుంటున్నారన్నారు. విదేశాల్లోని తమ కుటుంబ సభ్యుల తెలుగు భాషా మమకారాన్ని ఉదాహరించారు. తీయనైన తెలుగు భాషను బతికించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్. గణపతి రావు మాట్లాడుతూ తన మాతృభాష అయిన సవర భాష మధుర్యాన్ని తెలిపారు. సవర భాషతో పాటు అనేక గిరిజన భాషలు అంతరించిపోతున్నాయని అన్నారు. తెలుగు భాష కూడా అంతరించే భాషల్లో చేరిపోయిందని, ఈ ప్రమాదం నుంచి



కాపాడాల్సిన బాధ్యత విద్యార్థుల మీద ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా.ఎస్. రమేష్ బాబు, తెలుగు శాఖాధ్యక్షులు డా.వెల్దండి శ్రీధర్, ఇతర అధ్యాపకులు రాజు, విజయ భాస్కర్ రెడ్డి, డా. పెద్దిరాజు, రామచంద్రం, మార్కండేయ, కైలాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవించడం ముఖ్యం

అంతర్జాతీయ మాతృభాషా గొప్పదని మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శర్వాణి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా మహిళా డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని, మాతృభాష అంటే తల్లి నేర్పిన భాష అని అలాంటి భాషను గౌరవించడం ఎంతో ముఖ్యమని వివరించారు. అంతే కాక కళాశాల అధ్యాపకులు కస్తూరి, మంజుల, డా.పి.జయరాజ్, ప్రవీణ్, విద్యార్థినిలు స్నేహాంజలి, మానస, చందన, కుసుమ ప్రియలు మాట్లాడుతూ 1952 ఫిబ్రవరి 21న మాతృభాష కోసం నలుగురు బెంగాలీ యువకులు ప్రాణాలర్పించిన సందర్భంగా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించిందన్నారు. ప్రపంచంలోని భాషలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకురాలు ఉమారాణి, మృణాళిని విద్యార్థులు, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నం చేసింది నిజంకాదా?

నవతెలంగాణ-బెజ్జంకి

బీఆర్ఎస్ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించి సిద్దిపేట జిల్లాలో బెజ్జంకి మండలాన్ని కలిపి విచ్చిన్నం చేసింది నిజం కాదా అని దళిత మోర్చ జిల్లాధ్యక్షుడు దీటీ రాజు బీఆర్ఎస్ నాయకులపై ధ్వజమెత్తారు. మంగళవారం మండల పరిధిలోని దాచారం గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీటీ రాజు మాట్లాడారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్న బెజ్జంకి మండలాన్ని యథావిధిగా కొనసాగించాలని మండలంలోని 21 గ్రామాల ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీల తీర్మానాలను గతంలోని బీఆర్ఎస్ నాయకులు ఒంటెద్దుపోకడతో తుంగలో తొక్కి మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభీష్టం మేరకు మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఎంపీ, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఖండించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తమ స్వార్థ




ప్రయోజనాల కోసం కాకుండా చిత్తశుద్ధితో ప్రజలపై ప్రేమ ఉంటే మరోసారి ప్రజాభిప్రాయానికి సిద్ధమవ్వాలన్నారు. లేని పక్షంలో ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఎంపీ బండి సంజయ్, ఫిల్మ్ బోర్డ్ మెంబర్ దరువు ఎల్లన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కొలిపాక రాజు, నాయకులు బండిపెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు భోజనం

నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ కార్యదర్శి చకిలం రవి కుమారుడు శివకృష్ణ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో నిరాశ్రయులకు భోజనాలు పెట్టించారని వాసవి క్లబ్స్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు తొడుపునూరి కృష్ణవేణి,



ఆరవపల్లి హరికిరణ్, ట్రెజరర్ బూరుగు వేణుగోపాల్, తిమిశెట్టి విజయలక్ష్మి, పిఆర్ఓ అయిత శంకర్, ఇల్లందులో నాగేందర్, నవీన, చకిలం రవి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన రవి

- రచయిత కె.సజయ



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజా ఉద్యమానికి డిబిఎఫ్ రవి తన జీవితాన్ని అంకితం చేశాడని రచయిత కె.సజయ, ఉన్నత విద్యా మండలి సభ్యులు జి.పాపయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.తిరుపతి రెడ్డి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌లు అన్నారు. సిద్దిపేట ఉపాధ్యాయ భవన్‌లో మంగళవారం డీబీఎఫ్ నాయకుడు కొదాది రవి సంస్మరణ సభ జరిగింది. రవి చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవి నిబద్ధత గల కార్యకర్తగా, రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో పోరాటంలో రవి కీలక పాత్ర పోషించాడన్నారు. వ్యవసాయంలో క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని దళిత రైతులను రవి చైతన్యం చేశారన్నారు. ఉన్నత విద్యామండలి సభ్యులు జి.పాపయ్య మాట్లాడుతూ ప్రజాకార్యకర్తలు భౌతికంగా మరణించినా ప్రజల గుండెలలో నిలిచిపోతారన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ సాగించిన సమానత్వ పోరాటంలో మమేకమయ్యడన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ మానవత్వవాది అని ఆత్మీయతకు మారు పేరుగా నిలిచాడన్నారు. సామాజిక మార్పు కోసం సాగుతున్న పోరాటంలో మమేకం కావడమే రవికి నిజమైన నివాళి అన్నారు. ఈ సభలో డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఎగొండ స్వామి, చుంచు రాజేందర్, నాయకులు దుబాషి సంజీవ్, స్వామి, రాజమణి, భీమ్ శేఖర్, కిరణ్, వేణు, మాల మహానాడు నాయకులు కొదాది శ్రీనివాస్, ఎల్లేష్, సీసీసీ ప్రవీణ్, ముంద్రాయి సంజీవ్, రవి తల్లి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య స్వామివిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సుబ్రహ్మణ్య స్వామి ప్రతిష్టా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ తెలిపారు. తమిళనాడు తిరుత్తణి సుబ్రహ్మణ్య క్షేత్రం పండితుల నిర్వహణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బుధవారం గణపతి పూజ స్వస్తివాచనంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. జలాధివాస, క్షీరాధివాస శయ్యాధివాస ఫలపుష్పాధివాసాలు అధివాసాంగ హోమాలు జరుగుతాయన్నారు. గురువారం తెల్లవారుజామున 3-30 నిమిషాలకు ప్రతిష్ఠాపన జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి పంచలోహ ఉత్సవ మూర్తుల కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అంగడికిష్టాపూర్‌లో అగ్నిగుండ ప్రవేశం



నవతెలంగాణ-మర్కుక్

ఉమా మహేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రివేళ బలిహరణం, ప్రదోషకాల పూజ, భేరిపూజ, గజవాహన సేవ, అగ్నిగుండ ప్రవేశం, బ్రహ్మ శ్రీ మల్లంపల్లి సుబ్రహ్మణ్యశర్మ హైదరాబాదు వారితో హరికథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం వీరముష్టి వారిచే ప్రభలు తీయుట, పుల్లూరి నాగరాజు తీగుల్ బృందం అగ్నిగుండ ప్రవేశం చేశారు. మంగళవారం ప్రాతకాల పూజ, అభిషేకం, బలిహరణం, హవనం, శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్, ఆలయ చైర్మెన్ బల్లి శ్రీనివాస్ గుప్తా, ఎంపీటీసీ గోలి నరేందర్, ఆలయ పూజారి గడం భట్ల వెంకట నరసింహశర్మ, ఉప సర్పంచ్ కొండల్ రెడ్డి, నాయకులు మీసాల శ్రీనివాస్ రెడ్డి, మోహన్ పంతులు, బల్లి నాగరాజు, దుద్దెడ నర్సింలు గౌడ్, కె.శ్రీనివాస్ రెడ్డి, యాదవరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ముద్రాతి బాల్ రెడ్డి, రుక్మారెడ్డి, సుదర్శన్ గౌడ్, రాముగౌడ్, కుమ్మరి కనకయ్య, ఆర్.నాగరాజు, కంది నరసింహ చారి, లింగని నాగరాజు, ఆంజనేయులు, వెంకట్, తిరుపతి, లక్ష్మణ్, తదితరులున్నారు.

పదో తరగతి మోడల్ టెస్ట్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-వర్గల్


స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీన నిర్వహిస్తున్న 10వ తరగతి మోడల్ టెస్టును విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం వర్గల్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు నిర్వహిస్తుందన్నారు. టాలెంట్ టెస్టును ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. పోరాటాలు, ఉద్యమాలు కాకుండా విద్యార్థుల ప్రతిభను గుర్తించడంలో కూడా ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టులో అధిక సంఖ్యలో పాల్గొనాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆవిష్కరణలో గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు నాచారం శేఖర్, నాయకులు సంపత్, వంశీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడిని నిరసిస్తూ సీఎం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వరంగల్‌లో జరిగిన హాత్‌సే హాత్ జోడో పాదయాత్రలో యూత్ కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనుచరులు దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నవేని విద్యాసాగర్ మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ తట్టుకోలేక టీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దాడులకు భయపడేది లేదని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోచవేని శ్రీశైలం, అక్కన్నపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాండ్రాల దాము, చిగురుమామిడి మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి ఆదర్శ్, నియోజకవర్గస్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులు జవహర్ నాయక్, బందెల హరీష్ బాబు, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ నాయకులు మ్యాదరవేణి శ్రీకాంత్, బూరుగు సతీష్, మూడికే ప్రశాంత, పోగుల కుమార్, హుస్నాబాద్ మండల ఉపాధ్యక్షుడు ఎనగందుల కమలహాసన్, మండల ప్రధాన కార్యదర్శి మారుపాక గణేష్ నాయకులు పున్న రంజిత్, సావుల మధు, ఇజ్జగిరి అనిల్, కడగండ్ల శీను తదితరులు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ విద్యతో మంచి భవిష్యత్



నవతెలంగాణ-సంగారెడ్డి

పాలిటెక్నిక్‌తో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపాల్ డా.ఎం. శ్రీనివాసులు అన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల అధ్యాపక బృందం సంగారెడ్డి జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి, పదో తరగతి విద్యార్థినులకు పాలిటెక్నిక్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పాల్‌టెక్నిక్ వల్ల స్వయం ఉపాధితో పాటు, పాలిటెక్నిక్ తర్వాత ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆనంద్‌కుమార్, భాన్సింగ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి 24-04-23 చివరి తేదీ అన్నారు. మరిన్ని వివరాలను ఒవివ్ వశ్రీుఖఅస్త్రుఖఖు.ప్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని చాల్కి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతుండడంతో ఉదయాన్నే పాఠశాలకు వస్తున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు అల్పాహారం కూడా చేయకుండా పాఠశాలకు వస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించి.. చింతల లక్ష్మమ్మ సేవా సభ్యులు నెలరోజుల పాటు వారికి ప్రతీ రోజు ఉదయం స్నాక్స్ పంపిణీ చేయడానికి ముందుకొచ్చారు. అందులో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. కాగా ఇలాంటి సాయం చేయడం ఎంతో సంతోషకరమని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ సేవా సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. స్నాక్స్ అందజేసిన వారిలో చాల్కిపాఠశాల హెచ్‌ఎం మీనా కుమారి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యాయులు మణికుమార్, సాయిలు, బాల్ రెడ్డి,ఫయాజుద్దీన్, విశాల, విద్యార్థులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుడిపై దాడిని ఖండించిన నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

వరంగల్ జిల్లా ఏనుగులగడ్డ వద్ద సోమవారం జరిగిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర బహిరంగ సభ వద్ద టీపీసీసీ అధ్యక్షులు శ్రీ రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో.. వేదిక సమీపంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు తోట పవన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమేనని టీపీసీసీ నాయకులు వై.నరోత్తం ఆరోపించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దోషులను వెంటనే గుర్తించి వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

అంత్యక్రియలకు వీవీఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధి లోని లక్ష్మీనగర్‌కు చెందిన శ్రీకాకుళం వాసి బాబురావు (48) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువత నాయకులు వి.ప్రవీణ్‌రెడ్డి.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వీవిఆర్ ఫౌండేషన్ తరపున అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. గణపతి, రవితేజ, సతీష్, గణేష్, ఢిల్లీ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

నవతెలగాణ-మనూర్

పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని నిరసన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులను సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా విద్యాధికారులు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ.. పండితులను భయభ్రాంతుకు గురి చేసేలా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. సస్పెన్షన్ రద్దు చేసి.. వారిని బేషరుతుగా విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, ఉపాధ్యాయులు యాదగిరి, చంద్రకాంత్, లక్ష్మణ్, మల్లికార్జున్, దన్సింఘ్, రాజు, కిష్టయ్య, చంద్ర శేకర్, రామకృష్ణ రెడ్డి, భీం రావు, శివలింగం, సాంకి బాయి, శివ శేకర్‌లు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలి



నవ తెలంగాణ-రాయపోల్

ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దదించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాష్ట్రంలో హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగుతుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి, బేగంపేట గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సందేశాన్ని ఇంటింటికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాలను ఈడీ దాడులతో భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టీపీసీసీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కార్నాల శ్రీనివాస్ రావు, టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రేపాక తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలపురం కనకయ్య, మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి, సుధాకర్, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-తొగుట

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కర్ణాకర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలం లోని రాంపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు సైబర్ నేరగాళ్ల పెరిగి పోతున్నారని అన్నారు. ఫోన్ చేసి ఆధార్ కార్డు నెంబర్,బ్యాంకు డిటెల్స్, ఏటీఎం పిన్ నెంబర్ తదితరులు వివరాలు తెలియజేయా లని సైబర్ నేరగాళ్ల మోసాలకు గురి చేస్తారని సూచించారు. మనం ఏదో రకమైన పనిలో ఉన్న సమయంలో, మనలను మభ్యపెట్టి డబ్బులను దోచుకునే విధంగా నష్టం చేస్తారని తెలిపారు. ఇలాంటి మోసాల బారిన పడి డబ్బులు పోగొట్టు కోవద్దని అన్నారు. పోలీస్ సిబ్బంది రఘుపతి, కర్ణాకర్, బీడీ కార్మికులు, మహిళలు ఉన్నారు.

ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సంఘాల ఐక్య పోరాటాల వల్లనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. ఉపాధ్యాయుల పొదుపు చేసుకున్న జీపీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే ఆరు నెలలు గడిచినా ఇవ్వడం లేదన్నారు. సరెండర్ లీవ్ క్యాష్ కూడా ఆలస్యంగా ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, రేఖరాణి , ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, భాస్కర్ రవీందర్ రెడ్డి, కుమారస్వామి రత్నాకర్, వేణుగోపాల్ మురళీ బాబు, సందీప్ ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి



నవతెలంగాణ హవేలి ఘనాపూర్

కుటుంబ కలహాలతో వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హవేలిఘనపూర్ మండలంలోని శాలిపేట్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. హవేలిఘనపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారంపల్లి తండాకు చెందిన మూడు బాబు(36) బతుకుతెరువు కోసం మండలంలోని శాలిపేట గ్రామ శివారులో చెరుకు కొట్టడానికి వలస వచ్చారు. కుటుంబ కలహాలతో కలత చెందిన బాబు ఉరి వేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతునికి ఒక కూతురు,ఇద్దరు కుమారులు ఉన్నారు.

అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



నవతెలంగాణ-తొగుట

ప్రతి ఒక్కరూ కంటి పరీ క్షలు చేసుకోవాలని వైద్య అధికారి డాక్టర్ రాధాకిషన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో 11 రోజుల పాటు కంటి వెలుగు శిబిరం విజయవంతం అయిందని తెలిపారు. బుధవారం నుంచి పది రోజుల పాటు ఎల్లారెడ్డిపేట గ్రామంలో కంటి వెలుగు ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంటి వెలుగు శిబిరం కొన సాగనుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్ సిరినేని గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ వేల్పుల స్వామి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం లు,అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎప్పటికి తెర పడేనో?

క్యాంపులోనే కౌన్సిల్ సభ్యులు



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం లో 14 మంది కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి పై అవిశ్వాసం పెట్టి వారం రోజులు గడుస్తున్నా పార్టీ అధిష్టానం దృష్టి పెట్టలేకపోయింది. మున్సిపల్ చైర్మన్ ముందస్తుగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. కోర్టు స్టే సైతం ఈనెల 21 తో ముగుస్తుందని చెప్పాలి. ఈనెల 9న మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాసం కోసం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. చైర్మన్ పై అవిశ్వాసం పెట్టాలని పక్షం రోజులుగా మున్సిపల్ సభ్యుల మధ్య చర్చ జరుగుతున్న ఆ విషయంలో ఎవరు పట్టించుకో లేదు. అవిశ్వాసం ఎప్పుడు వీడుతుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు. అవిశ్వాసం పెడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ కుచెప్పినప్పటికీ పార్టీ అధిష్టానం చూసుకుంటుందని కొట్టి పారేశారు. మున్సిపాలిటీలో మొత్తం 20 మంది సభ్యుల్లో 14 మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. పార్టీ అధిష్టానం ఒత్తిడి తీసుకొస్తుందని భావించిన స్థానిక కౌన్సిల్ సభ్యులు అదే రోజు క్యాంపుకు వెళ్లారు. ఇంతకాలం సభ్యులందరూ కలిసి ఉన్నప్పటికీ పట్టణ సమస్యలపై సమనీయంతో పనిచేయలేకపోయారని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అసమతి సమస్య ముగిసే వరకు మున్సిపల్ పాలన ముందుకు వెళ్లే విధంగా కనిపించడం లేదు. మున్సిపల్ చైర్మన్ ,కౌన్సిల్ సభ్యుల మధ్య సఖ్యత కొరబడిందని స్పష్టమవుతుంది. ఒకవేళ సభ్యులు అవిశ్వాసం పెట్టకపోయినా కలిసి ఉండటం కష్టంగా కనిపిస్తుంది. నిత్యం మున్సిపల్ లో చైర్మన్ సభ్యుల మధ్య కలహాల కాపురం మాదిరిగా జరిగే అవకాశం ఉంది. గజ్వేల్ పట్టణంలో అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల మున్సిపల్ లో రు. 23 కోట్ల రూపాయలను విడుదల చేసి సీసీ రోడ్లు, మురికి కాలువలు పూర్తి చేయాలని మంత్రి హరీష్ రావు ఆదేశించారు. అయితే పక్షం రోజుల ముందే చైర్మన్ పై విశ్వాసం పెట్టాలని భావించినప్పటికీ నిధులు మంజూరు అవుతున్న నేపథ్యంలో సభ్యులు వెనుకకు తట్టారు. వార్డుల వారిగా నిధులు కేటాయించి కొన్ని టెండర్లు పూర్తయిన తర్వాత అవిశ్వాసానికి దారి తీసింది అని చెప్పాలి. ఇందులోనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని పేదలు కౌన్సిల్ సభ్యుల చుట్టూ తిరిగి ఇల్లు వచ్చే విధంగా ప్రయత్నించుకుందామంటే మెజార్టీ సభ్యులంతా అవిశ్వాసంలో ఉండటంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాణి పేదలు మున్సిపల్ చైర్మన్ చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకునే లేదని మున్సిపల్ సిబ్బంది చెప్తున్నట్లు లబ్ధిదారులు అంటున్నారు. ఫిబ్రవరి 10 తో డబుల్ బెడ్ రూమ్ జాబితాపై స్థానికుల అభిప్రాయాలను తెలిపేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. గడువు ముగిసిందని మరికొందరు డబుల్ బెడ్ రూమ్ కోసం వినతి పత్రాలు అందించారు. ఇందులో కూడా ఇల్లు లేని వాళ్ళు గుర్తించాలంటే స్థానికంగా కౌన్సిల్ సభ్యులు ఉండవాలని ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన 23సమావేశంలో చర్చకు వచ్చింది. అనేక వార్డుల్లో ఇంకా సిసి రోడ్లకు టెండర్లు కావాల్సింది. మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాసం ఉన్నందున సభ్యులు అందుబాటులో లేకపోయారు. దీంతో చాలా చోట్ల అనేక పనులు నిలిచిపోయాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 100 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు పూర్తి కావాల్సి ఉంది. మున్సిపల్ రూరల్ ప్రాంతమైన క్యాసారం, ముత్రాస్పల్లి, రాజిరెడ్డిపల్లి, సంగుపల్లి, గుండనపల్లి అండర్ డ్రైనేజీ పనులకు మరో..రు 48 కోట్లు అవసరం ఉన్నట్లు ఇప్పటికే ఫలితాలు పంపారు. ఇన్ని సమస్యల మధ్య గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పై అవిశ్వాసం పత్రాన్ని అందించారు. పార్టీ అధిష్టానం మాత్రం అవిశ్వాసం వీడే విధంగా ఎప్పుడు చర్యలు తీసుకుంటారో తెలియటం లేదు. పార్టీ అధిష్టానం తొందరగా నిర్ణయం తీసుకొని అవిశ్వాస సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్చి 21 వరకు కోర్టు స్టేట్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి పై ఈ నెల 9న 14 మంది కౌన్సిల్ సభ్యులు అవిశ్వాసం కోసం కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. తనకు అవిశ్వాస నోటీసులు జారీ చేయకుండా మున్సిపల్ చైర్మన్ గత వారం క్రితం కోర్టుకు వెళ్లారు. కోర్టు ఈనెల 21 వరకు గడువు మంగళవారంతో ముగిసింది. తిరిగి మంగళవారం జరిగిన కోర్టు వాదనలో భాగంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పిటిషన్ కొనసాగించాలని సంబంధిత న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు వాదాలను మార్చి 21 వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్, నర్సాపూర్, చేర్యాల మున్సిపల్ పై అవిశ్వాసం కు వినతి పత్రాలు అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా కోర్టు ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని ప్రయత్నం చేస్తుంది. దీంతో ఆయా మున్సిపల్ చైర్మన్లు కోర్టుకు వెళ్లడంతో కోర్టు పిటిషన్లను కొనసాగింపు చర్యలను తీసుకుంటుంది. ఇందులో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ పై పిటిషన్ మార్చి 21 వరకు ఉంటుందని పైకి కనిపిస్తున్న లోలోపల మాత్రం ఇదే పద్ధతిలో కొనసాగే అవకాశం కనిపిస్తుంది. కోర్టు స్టేలపైనే పదవి కాలం ముగిసే అవకాశం ఉంది.

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే!

- నిలిచిన ధర్మారం-దుంపలపల్లి-బల్వంతాపూర్ బిటి రోడ్డు పనులు
- పత్తా లేని కాంట్రాక్టర్
- గడువు సమీపిస్తున్నా సగం కూడా పూర్తికాని పనులు





నవ తెలంగాణ-దుబ్బాక

ధర్మారం-దుంపలపల్లి-బల్వంతాపూర్ బీటీ రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉన్నాయి. కాలపరిమితి సమీపిస్తున్నా నేటికీ సగం పనులు పూర్తి కాలేదు. మిరుదొడ్డి మండలం ధర్మారం నుండి దుబ్బాక పురపాలిక పరిధిలోని దుంపలపల్లి వార్డు మీదుగా దుబ్బాక మండలం బల్వంతాపూర్ వరకు 7.10 కిలోమీటర్ల మేర వేయాల్సిన బిటి రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి.రోడ్డుకిరువైపులా మట్టి కుప్పలు వేసి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో ధర్మారం పీడబ్ల్యూడి రోడ్డు నుండి దుంపలపల్లి మీదుగా బల్వంతాపూర్ వరకు 7.10 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి (పిఎంజిఎస్ వై) ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రూ.4 కోట్లు మంజూరయ్యాయి.ఈ పనులకు 2021 డిసెంబర్ 25 న రాష్ట్ర ఆర్థిక,వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది.కరీంనగర్ కు చెందిన జె ఎస్ ఆర్ అండ్ కంపెనీ ఈ పనులను దక్కించుకుంది.ఈ ఏడాది జూన్ లోగా పనులు పూర్తి కావాల్సి ఉండగా కనీసం ఇప్పటివరకు సగం పనులు కూడా జరగకపోవడం గమనార్హం.గత కొద్ది నెలలుగా కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయారు.ఫోన్ చేసిన ఎత్తడం లేదని అధికారులు చెబుతున్నారు.గడువు సమీపిస్తున్నా సదరు కాంట్రాక్టర్ పనులు చేయకపోవడం పట్ల అధికారుల పర్యవేక్షణ కరువైంది.ఈదారి వెంబడి ప్రయాణించే ప్రజలకు చిన్న చిన్న రాళ్ల ,దుమ్ము కళ్ళల్లో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బీటి రోడ్డు పనులను వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికే రెండుసార్లు నోటీసులు ఇచ్చాం

ధర్మారం-దుంపలపల్లి-బల్వంతాపూర్ బీటి రోడ్డు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ జె ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్స్ వారు గత కొద్ది నెలలుగా పనులు నిలిపివేశారు.పనులు ఆపినందుకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు కూడా ఇచ్చాము.కాంట్రాక్టర్ కు ఫోన్ చేసినా ఎత్తడం లేదు.పై అధికారుల ద్వారా అతనిపై చర్యలు తీసుకుంటాం.

– రిజ్వాన్, పంచాయతీరాజ్ ఏఈ

నందీశ్వర్ గౌడ్‌పై ఎమ్మెల్యే ఫైర్

- సహేతుక ఆరోపణలు చేయండి.. సమాధానం ఇచ్చేందుకు సిద్ధం
- కబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే ఏదానికైనా సిద్ధం
- పటాన్‌చెరు ఎమ్మెల్యే జీఎంఆర్



నవతెలంగాణ-పటాన్‌చెరు

మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ నిరాధారణ ఆరోపణలు చేస్తూ.. రాజకీయాల్లో విలువలను మంటగలుపుతున్నాడని.. ఆయనకు ప్రజలు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మారడం లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీ నుండి నందీశ్వర్ గౌడ్‌కి టికెట్ కేటాయిస్తే మరోసారి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్‌పై ఫైర్ అయ్యారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. నందీశ్వర్‌గౌడ్‌కు 1987లో ఎలాంటి గుర్తింపు లేకున్నా.. దివంగత మాజీ మంత్రి పి.రామచంద్రారెడ్డి పుణ్యమా అంటు ఎంపీపీగా ఎన్నికయ్యాడని ఘాటు విమర్శలు చేశారు. ఎంపీపీగా చేసిన సమయంలోనీ ఆఫీసును నీవే తగలపెట్టించుకుని, నక్సలైట్ల దాడి జరిగిందని, నక్సలైట్ల హిట్ లిస్టులో ఉన్నానని నాటకాలాడి గన్ మెన్లను పెట్టుకున్నావంటూ మండిపడ్డారు. ఆరిస్ట్రో పరిశ్రమలోనీ యూనియన్ రాజకీయాలకు అడ్డు వస్తున్నాడని ఒక వర్కర్ ను పాటి గ్రామం జొన్న చేనులో చంపి సాక్ష్యాలను తారుమారు చేశావంటూ ఆరోపించారు.బస్టాండ్ ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తానని, పరిశ్రమలలో చందాలు వసూలు చేసి విగ్రహం పెట్టకుండా చందాలు జేబులో వేసుకున్నావని దుయ్యబట్టారు. వారానికి ఒకరోజు పటాన్‌చెరులోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో మామూళ్ల కోసం నువ్వు పెట్టె ఇబ్బంది తట్టుకోలేకనే ఆఫీస్‌ను ఎత్తివేశారని విమర్శించారు. నేను రెండు వేల కోట్ల రూపాయలు ఆస్తిని సంపాదించాను అంటూ ఆరోపణలు చేస్తున్నావు కదా, ఆధారాలతో నిరూపిస్తే ఉన్న ఊరును, ఇంటిని వదిలేసి వెళ్తా అందుకు నువ్వు రెడీనా అని సవాల్ విసిరారు. తన నాన్న 200 ఎకరాలు సంపాదిస్తే, 100 ఎకరాలను ఎన్నికల్లో పోటీ చేసి అమ్ముకున్నానన్నారు. ప్రజా జీవితంలో ప్రజలు ఆశీర్వదించినంత కాలం ఎంతటి ఆస్తినైనా అమ్ముకునేందుకు సిద్ధమే అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు కాకముందే కంటోన్మెంట్ ఎన్నికల్లో బిజెపి సత్తా చూపుతుందంటూ వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమన్నారు. పటాన్ చెరులోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయం నిర్మించిన అల్లాని వంశస్తులు, దేవాలయ ఖర్చులు పూజారుల జీతభత్యాల కోసం ఏడు ఎకరాల 27 గంటల భూమి కేటాయించగా, ప్రస్తుతం పూర్తి భూమి దేవాలయం రక్షణలో ఉందని దేవాలయ ప్రధాన పూజారి నరసింహచారి, ధర్మకర్త అల్లాని శ్రీనివాస్, గుడి అధ్యక్షులు మనోహర్‌రెడ్డిలు తెలిపారు. ఇందులో కొంత భూభాగంలో ప్రైవేటు గృహ నిర్మాణ సంస్థ అద్దె ప్రతిపాదికన రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఐదు లక్షల రూపాయలు అందిస్తుందని తెలిపారు. రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ సంస్థ ఎండి సంజీవరెడ్డి ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో ధ్రువీకరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ప్రజల ఆశీస్సులతో రెండుసార్లు శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యాయని, హ్యాట్రిక్ విజయం అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ గడీల కుమార్ గౌడ్, ఎంపిపిలు సుష్మశ్రీ వేణుగోపాల్ రెడ్డి, ఈర్ల దేవానంద్, జడ్పిటిసిలు సుప్రజా వెంకట్ రెడ్డి, గంగుల సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-పుల్కల్

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మంగళవారం నాడు పుల్కల్ మండల పరిధిలోని లాల్సింగ్ నాయక్ తాండాలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు సేవాలాల్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. గిరిజనుల కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రతీ గిరిజన తాండాను పంచాయతీగా చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు వారికి ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా గిరిజనులకు తెలంగాణ రాష్ట్రంలో 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత తమదేనన్నారు. తాండాల్లో సీసీరోడ్లు, విద్యుత్ దీపాలతోపాటు డ్రయినేజీలను నిర్మించినట్టు గుర్తు చేశారు. సేవాలాల్ మహారాజ్ పుట్టిన రోజును అధికారికంగా చేపట్టడమే కాకుండా ఆరోజు సెలవుదినంగా ప్రకటించే విధంగా తమ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి మండలంలో నియోజకవర్గంలో గిరిజనులకు బంజారా భవన్ ఏర్పాటు కోసం కృషి చేస్తామన్నారు. జడ్పీ చైర్పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, ఎంపీ పీ చైతన్య విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీవో మధులత, పార్టీ మండలాధ్యక్షులు మాచర్ల విజయకుమార్, చౌటకూర్ మండల అధ్యక్షులు శివకుమార్, ఆత్మ కమిటీ మండల అధ్యక్షులు యాదగిరి రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మహాశివరాత్రి వేడుకలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడ్రోజులపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మెన్ ఏనుగు తులసి రెడ్డి తెలిపారు. మంగళ వారం ఆలయంలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మెన్ ఏనుగు తులసిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సిబ్బంది భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ సంవత్సరం నిర్వహించే మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పెద్ద ఎత్తున మహాశివరాత్రి వేడుకలను నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెద్ద ఎత్తున పెరిగిందని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు అన్ని రకాల ఏర్పాటు చేశామన్నారు. ఈ యొక్క మహాశివ రాత్రి వేడుకల్లో భాగంగా మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్ పూర్ మున్సిపాలిటీ మరియు పోలీస్ డిపార్ట్మెంట్ స్థానిక సీఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేయడం, పార్కింగ్ సమస్య లేకుండా, భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ సహకారం చాలా గొప్పదన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, సమన్వయంతో పని చేయడం జరిగిందన్నారు. ఈ మహాశివరాత్రి వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించిన పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డికి ఆలయ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా చందు



నవతెలంగాణ-జోగిపేట

కురుమ సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా జోగిపేట పట్టణానికి చెందిన గూడెం చందు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కురుమ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నగేష్ ప్రకటిం చారు. మంగళవారం జోగిపేట ఉన్ని సహకార సంఘంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈనెల 26న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉందని, ఈ సభలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చినందుకు జిల్లా కురుమ సంఘం పెద్దలందరికీ చందు ధన్యవాదాలు తెలిపారు. అందోల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా గొర్ల కార్తు మల్లేశంను నియమించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు ప్రవీణ్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, మండల కురుమ సంఘం అధ్యక్షులు సంగమేశ్వర్, గొర్ల కాపర్ల సంఘం పట్టణ అధ్యక్షులు గూడెపు నాగరాజు, డైరెక్టర్లు లక్ష్మణ్, నాగరాజు, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు ఉస శివశంకర్, నాయకులు వెంకటేశం, రాములు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా డబుల్ ఇండ్ల డ్రా తీస్తారు?



నవతెలంగాణ-జహీరాబాద్

డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులకు కనీస సమాచారం ఇవ్వకుండా డ్రా తీయడంలో అంతర్యం ఏమిటని ప్రజా సంఘాల నాయకులు మహిపాల్ అన్నారు. లబ్ధిదారుల లిస్టు మరోసారి రీ సర్వే చేయాలని సీఐటీయూ, ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మంగళవారం లాటరీ తీసే స్థలానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. హెూతి(కే) వద్ద డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిస్థాయిలో నిర్మించకుండానే.. లబ్ధిదారులకు తెలియకుండా ఇండ్ల కేటాయింపులకు లాటరీ చేపట్టడం సరికాదన్నారు. కాగా అనర్హులకు గతంలో ఇండ్లు వచ్చాయని, ఆ లిస్ట్ ప్రకారమే మళ్లీ లాటరీ తీస్తే అనర్హులకు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. అర్హుల లిస్టను తయారు చేయాలని, రీ సర్వే చేయాలని, రి సర్వే చేసిన తర్వాతే లాటరీ తీయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమం ఉధృతం చేస్తామని అన్నారు. స్పందించిన తహసీల్దార్ పై అధికారులు దృష్టి తీసుకెళ్లి రీ సర్వే పై నిర్ణయం తీసుకుంటామని.. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐటీయూ ఐద్వా, డీవైఎఫ్ఐ, అవ్వాజ్, కేవీపీఎస్ నాయకులు శాంతమ్మ, సలీమోద్దీన్, మూతబీర్,బక్కన, రాజు, నర్సింలు, తారమ్మ, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జగంరెడ్డిపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కుమార్‌తో కలిసి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అద్భుత పథకాల్లో కంటి వెలుగు ఒకటి అన్నారు. నిరుపేదల ముఖాల్లో సంతోషం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి.ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్.సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు రాచర్ల నరేష్. మండల ముదిరాజ్ సంఘం యువజన అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు సన్మానంతోనే సరి!

- సేవలను గుర్తించని అధికారులు



నవతెలంగాణ-ఝరాసంగం

జిల్లాలోనీ ఝరాసంగం మండలంలో అతి పురాతనమైన శైవ క్షేత్రాలలో ఒకటైన శ్రీ కేతకి సంగమేశ్వర దేవాలయం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. ప్రతీ సంవత్సరం కేతకి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహి స్తోంది. ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలను విజయవ ంతం చేసేందుకు ప్రభుత్వ 19 శాఖల సేవలను వినియోగిం చుకున్నారు. ఇందులో భాగంగా అదనంగా పాలిటెక్నిక్, డిగ్రీ చదువుతున్న 60 మంది ఎన్‌సిసి విద్యార్థులను (17 నుండి 20 తేదీ వరకు) మూడ్రోజులపాటు వాలంటీర్లుగా వారిని నియమించి వారి సేవలను వినియోగించుకున్నారు. అయితే ప్రతీసంవత్సరం వారి సేవలను గుర్తిస్తూ సేవా పత్రాలను అందజేసేవారు. కానీ ఈ సంవత్సరం శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలతో సరిపెట్టారు.

ఐటిఐలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవ తెలంగాణ-దుబ్బాక

ప్రైవేట్‌గా ఐటిఐ చదువుకునేందుకు ప్రభుత్వ,ప్రైవేటు కంపెనీలు,ఆఫీసుల్లో పనిచేస్తున్న వారు, ఆయా శాఖల్లో మూడేళ్ల అనుభవం ఉండి ఈఎస్ఐ, పిఎఫ్,ఈపీఎఫ్ ఆధారాలున్నవారు, సిఓఈ (ఐటిఐ) ఉత్తీర్ణులైన వారు, ఇదివరకే ఐటిఐ పాసైనవారు ఈనెల 28 లోగా ప్రభుత్వ ఐటిఐ కళాశాల కుకునూరుపల్లి యందు సంప్రదించాలని దుబ్బాక ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ డి.వెంకటరమణ తెలిపారు.దరఖాస్తుకు రూ.100 చెల్లించి రసీదు పొందాలన్నారు.సిఓఈ,ఎస్ సివిటి,ఎన్ సివిటి పూర్తిచేసిన వారు ఫిట్టర్,ఎలక్ట్రిషన్,డీజిల్ మెకానిక్ కోర్సులకుగాను కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఖాళీలు ఉన్న సీట్లకు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వారికి డైరెక్ట్ ఎగ్జామ్ ఉంటుందన్నారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఇక్కడ అవకాశం ఉందన్నారు. జిల్లా మొత్తంలో కుకునూరుపల్లి ఐటిఐలో మాత్రమే ఫిట్టర్,ఎలక్ట్రీషియన్,డీజిల్ మెకానిక్ అనే 3 ట్రేడ్లలో ఈ అవకాశం ఉందన్నారు.మరిన్ని వివరాలకు కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో పలు ట్రేడ్లలో చేరడం కోసం ప్రైవేట్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ డీజిల్ ట్రేడ్లలో ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 28 వ తేది లోగా తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

ఎఎంసీ డైరెక్టర్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మర్కుక్

వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బురు రాందాస్ గౌడ్ మాతృమూర్తి బబ్బురి లక్ష్మీ నర్సమ్మ (98) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మంగళవారం జగదేపూర్ సహకార సంఘం వైస్ చైర్మన్ ఎర్రవల్లి బాలరాజు, వర్ధరాజ్ పూర్ మాజీ సర్పంచ్ లక్కాకుల నరేష్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య, మొర్సు కర్ణాకర్ రెడ్డిలు మృతికి గల కారణాలను తెలుసుకొని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎఫ్‌డీసీ చైర్మెన్



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలోని నూతనంగా ఐఏఎస్‌కు ఎన్నికైన వెంకట నరసింహ రెడ్డి తల్లి మంగళ వారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎఫ్డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి,ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,గజ్వేల్ ఏసీపి రమేష్, ఎంపీపీ బాలేశం గౌడ్ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డిలు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వీరి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,శశిధర్ శర్మ, ఎస్ఐ కృష్ణమూర్తి,మహేందర్ రెడ్డి ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఆకారం మల్లేశం అనే వ్యక్తి గత కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ మంగళవారం పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

రాయపోల్ ఎంపీపీని సన్మానించిన ఎంపీపీ సంధ్య



నవ తెలంగాణ -దౌల్తాబాద్

రాయపోల్ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాసులును మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో మంగళవారం దౌల్తాబాద్ ఎంపీపీ గంగాధర్ సంధ్య రవీందర్ సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇప్ప లక్ష్మీ పూజలు, కల్లూరి అనిత, శ్రీనివాస్ లతో కలిసి ఎంపీపీ సంధ్య రాయపోల్ ఎంపీపీ పెళ్లిరోజు సందర్భంగా శాలువతో సనానించారు. అనంతరం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఇలాంటి పెళ్లి రోజులు మరెన్నో చేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించామన్నారు. మండలంలో ప్రతి మహిళా స్వేచ్ఛగా రాజకీయంగా ముందుకు రావాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తిప్ప దయాకర్, గంగాధరి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలోనే అసలైన సంతృప్తి

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మార్క సతీష్ కుమార్

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

సేవలోనే అసలైన సంతృప్తి ఉంటుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మార్క సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన గ్యార పూజిత వివాహం సందర్భంగా సిద్దిపేట కు చెందిన మార్క సతీష్ కుమార్ 50 కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ కార్యక్రమాలు తనకెంతో ఇష్టమని అనేక మందికి బియ్యం, బట్టలు, నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు బట్టలు, బ్లాంకెట్స్, బుక్స్, ఆర్థికంగా నగదు, బియ్యం, తాళిబొట్లు రూపంలో అందించడం జరిగింది. ఇంకా ఎవరైనా నిరుపేదలు ఉంటే తన దృష్టికి తెస్తే సహాయం చేస్తానని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో సిద్దిపేట మండల అధ్యక్షులు గుర్రం అంజిరెడ్డి



నారాయణరావుపేట ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బింగి యాదగిరి, రాష్ట్ర నాయకులు దాస అంజయ్య, భైరి సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు అర్జున్, రాకేష్ యాదవ్, టౌన్ అధ్యక్షులు మల్లేశం పాల్గొన్నారు.

ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తోన్న కేసీఆర్ సర్కార్

నవ తెలంగాణ-దుబ్బాక రూరల్

ఖర్చుతో కూడుకున్న ఖరీదైన వైద్యాన్ని కంటి వెలుగు కార్యక్రమం ద్వారా సీఎం కేసీఆర్ సర్కార్ ఉచితంగా ప్రజలకు అందిస్తుందని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ,సర్పంచ్ పుట్లగారి శంకరయ్య అన్నారు. మంగళవారం దుబ్బాక పరిధిలోని అక్బర్ పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపిపి కొత్త పుష్పలత, దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ, పిఎసిఎస్ ఛైర్మన్ శేర్ల కైలాష్, ఎంపిటిసిల ఫోరం మండలాధ్యక్షుడు మంద చంద్రసాగర్, సర్పంచ్ పుట్లగారి శంకరయ్య, ఉప సర్పంచ్ రవిచారిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర శర్మ, ఎంపీఓ నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరీష్, ఏఎంసీ డైరెక్టర్ బి.దేవరాజ్, బిఆర్ఎస్



భూంపల్లి మండలాధ్యక్షుడు జీడిపల్లి రవి, ఉమ్మడి మెదక్ జిల్లా టెలికాం బోర్డు మెంబర్ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు దయాకర్, ఎర్రోళ్ల రాజు, అంగన్వాడిలు, ఆశాలు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

వికాస పిల్లలు విద్యారంగంలో రాణించాలి

మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వికాస (అనాధ) పిల్లలు విద్యారంగంలో రానిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని వైశ్య భవన్‌లో బాలవికాస ఆధ్వర్యంలో వికాస పిల్లల పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత మాట్లాడుతూ వికాస పిల్లలకు భరోసాగా బాలవికాస సేవా సంస్థ కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు విద్యను అభ్యసించడానికి సెల్‌ఫోన్, ట్యాబ్‌లను అందిస్తుందన్నారు. వికాస పిల్లల కోసం గ్రామాలలోని మహిళలు వందల సంఖ్యలో వచ్చి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, బాలవికాస ప్రోగ్రాం డైరెక్టర్ లత , బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేడం లింగమూర్తి , ఐలేని మల్లి కార్జున్ రెడ్డి వరియోగుల శ్రీనివాస్ ,బంక చందు, వెన్నరాజు హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ రమ దేవి, జ్యోతి, నిర్మల, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండలంలోని రామారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు స్వామి గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు స్వయంగా ఉపాధ్యాయుల విధుల పట్ల పాఠశాల విధులు సమాజం తీరుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐదవ తరగతి విద్యార్థులు డీఈవోగా లాల్ కుమార్, ఎంఈఓగా అర్చన, సాయి చరణ్, ప్రధానోపాధ్యాయులుగా విష్ణువర్ధన్, మిగతా విద్యార్థులు సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వామి, స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఈడీ ఎక్జామ్ సెంటర్ వద్ద 144 సెక్షన్

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్‌లో ఈ నెల 22వ తేది నుంచి 28వ తేది వరకు డీఈడీ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ సెంటర్ వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు సీపీ.ఎన్. శ్వేత తెలిపారు. 28 వరకు సెంటర్ సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసి వేయాలని, పరీక్ష సెంటర్ వద్ద నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని సూచించారు. పరీక్షలకు భద్రతా ఏర్పాటు చేశామని, పోలీస్ అధికారులు పరీక్ష సమయంలో పెట్రోలింగ్ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

భద్రతా విభాగంలోకి మూడు జాగిలాలు

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ భద్రతా విభాగంలోకి నూతనంగా మూడు జాగిలాలు చేరాయి. మంగళవారం వాటిని సీపీ శ్వేత ముందు హాజరుపరచగా, ఆమె వాటి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విఐపి బందోబస్తు వచ్చినప్పుడు భద్రతపరంగాను, ఏదైనా హత్యలు, దోపిడీ జరిగినప్పుడు నేరస్తులను పట్టుకోవడానికి జాగిలాలు ఉపయోగపడతాయని తెలిపారు. వీటి సంరక్షణ బాధ్యత డాగ్ హ్యాండ్లర్‌పై ఉందని, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ పట్టణంలోని శివాజీ నగర్ కు చెందిన కే. మల్లేశం(62) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొన్ని రోజులుగా మల్లేశం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య ధనలక్ష్మి బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేకపోవడంతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- దౌల్తాబాద్ : మండల పరిధిలోని ముబారస్ పూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పంజా వెంకటయ్య అనే రైతు పొద్దంతా తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేసి రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. బోటుక లక్ష్మణ్‌కు గుండె ఆపరేషన్ అయిన విషయం తెలుసుకొని బాధిత కుటుంబాలను వేరువేరుగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మంగళవారం పరామర్శించారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంట్లో యజమాని మృతి చెందితే ఆ కుటుంబం అనాథ అవుతుందని ఆయన అన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ఆరోగ్యానికి ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. స్థానిక సర్పంచి యాదగిరి ఉపసర్పంచి స్వామి మండల పార్టీ అధ్యక్షుడు పోతరాజు కిషన్ సీనియర్ నాయకుడు కుమార్, నరసింహులు, కౌకూరి యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

సాయన్న మీద ఎందుకు వివక్ష



నవ తెలంగాణ- గజ్వేల్

కంటోన్మెంట్ రిజర్వుడు ఎమ్మెల్యే జి సాయన్న మృతి చెందడం బాధాకరమని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శినీరుడి స్వామి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూదళిత ఎమ్మెల్యే సాయన్న అవమానపరిచిన బిఆర్ఎస్ పార్టీకి పతనం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ లాంఛనాలతో దాన సంస్కారం చేయకుండా దళిత జాతిని అవమానించడం కేసీఆర్‌కి దళితులందరూ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దళితుల పైన నిజమైన ప్రేమ ఉంటే దళిత ఎమ్మెల్యేలు వెంటనే దీని గురించి రాజీనామా చేయాలన్నారు. సినీ నటుడు కృష్ణకు అధికారుల అంచనాంగా చేసిన ప్రభుత్వం ఇక్కడ ఎందుకు చేయలేదన్నారు.

బిజెపి భరోసా శక్తి కేంద్రాలు



నవ తెలంగాణ -దౌల్తాబాద్

మండల లోని సూరంపల్లి గ్రామంలో మంగళవారం శక్తి కేంద్ర కార్యకర్త సమావేశం లో దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు నిర్వహించారు, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా బూత్ స్థాయి కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే రఘునందన్ రావు పేర్కొన్నారు, శక్తి కేంద్రం మీటింగ్ పార్టీని బలోపేతం చేయడానికి పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయి కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బి ఆర్ ఎస్ కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధానమంత్రి మోడీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పోతరాజు కిషన్, ఉప సర్పంచ్ బొల్లం స్వామి, బండి రాజు, తోపాటు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థి అదృశ్యం



నవ తెలంగాణ- దౌల్తాబాద్:

విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రమైన దౌల్తాబాద్ లో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ పట్టణానికి చెందిన కండ్ల కొయ్య కనకవ్వ స్వామి దంపతులకు ఇద్దరు సంతానం. కల్ల కొయ్య శివకుమార్(9) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం మాతోపాటు నిద్రలేచి కాల కృత్యాలు తీసుకొని ఉదయం ఏడు గంటల వరకు మాతోనే ఉండి స్నేహితుల వద్దకు వెళ్లి ఆడుకొని వస్తానని చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం సమయం అయినా శివకుమార్ ఇంటికి రాకపోవడంతో స్నేహితుల ఇళ్లతో పాటు బంధువుల ఇరుగు పొరుగు వారిని అడిగినా ఎలాంటి సమాధానం లభించకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శివకుమార్ తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. శివ కుమార్ ఎత్తు నాలుగు ఫీట్లు రంగు సామనా ఛాయా ఎరుపు రంగు షర్టు, బ్లూ కలర్ నిక్కర్ ధరించి ఉన్నాడు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే 9704095330లో సమాచారం అందించాలన్నారు.

భూములను కబ్జా చేస్తున్న అధికార పార్టీ నాయకులు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం అధికార పార్టీ నేతలు భూ కబ్జాలు అక్రమమట్టి వ్యాపారం పేదవాలను బెదిరించి వాళ్ల భూములు లాక్కోవడం జరిగిందని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎదిరించేవారిపై అక్రమ కేసులు పెట్టడం భావ్యం కాదన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లలోనే సుమారు ఐదు కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శలు వస్తున్నాయన్నారు. మున్సిపాలిటీలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు అధికారులు తమ స్వప్రయోజనాల కోసం ప్రజల హక్కులు కాలరాస్తున్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులు భయభ్రాంతుల గురి చేస్తున్నారు ఆయన ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలను కల్లబొల్లిగా చూసుకుంటా అని మాయమాటలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు వచ్చే ఎన్నికల్లో గజ్వేల్ ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని ఆయన తెలిపారు.

ఈఫ్లుతో భాషలపై మంచిపట్టు

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు



నవ తెలంగాణ - సిద్దిపేట

ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ (ఈఫ్లు) యూనివర్సిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఇంద్రనగర్ జెడ్పీ హైస్కూలును దత్తత తీసుకోవడం ద్వారా ఇక్కడ విద్యార్థులకు ఇంగ్లీష్ , ఫారిన్ లాంగ్వేజ్ లపై శిక్షణ ద్వారా విద్యార్థులకు భాష పై మంచిపట్టు వస్తుందని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈఫ్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సురేష్ కుమార్, జెడ్పి చైర్పర్సన్ రోజా శర్మ అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్ సమక్షంలో శిక్షణ పై ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తన కోరికను మన్నించి ఈఫ్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మిత్రుడు సురేష్ సిద్దిపేటలో స్కూల్ దత్తత తీసుకొని ఇక్కడ విద్యార్థులకు ఇంగ్లీష్ తో పాటు ఫారిన్ లాంగ్వేజ్ లో శిక్షణ ఇచ్చినందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరా నగర్ స్కూల్ ఇంత బాగా అభివృద్ధి చేసిన ఉపాధ్యాయులకు , పిల్లలకు, పిల్లలు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంవత్సరం పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తానే స్వయంగా బహుమతులను అందిస్తానని మంత్రి చెప్పారు.

బీసీ స్టడీ సర్కిల్ భవనంకు శంకుస్థాపన చేసిన మంత్రి

వరద ప్రవాహంలా ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు విడుదల చేశామని రాష్ట్ర మంత్రి హరీష్ రావు అన్నారు. సిద్దిపేటలో బీసీ స్టడీ సర్కిల్ కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో పాల్గొనే ఉద్యోగార్థులకు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్స్ లలో శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు, ఇవేగాక తన సొంత ఖర్చుతో కేసీఆర్ శిక్షణ శిబిరంలో ఉద్యోగార్థులకు శిక్షణ తరగతులు అందిస్తున్నట్లు వివరించారు. పాత పది జిల్లా కేంద్రాలలో మాత్రమే బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్స్ ఉండేవనీ, కానీ 2015లోనే సిద్దిపేట జిల్లా ఏర్పాటు కాకముందే బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్స్ తెచ్చుకోవడం జరిగిందని, ఇవాళ రూ.4.10 కోట్ల వ్యయంతో బీసీ స్టడీ సర్కిల్ శాశ్వత భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 19 బీసీ గురుకులాలు ఉండేవనీ 8 వేల మంది విద్యార్థులు ఉండేవారనీ, స్వరాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో 310 బీసీ గురుకులాలు ఏర్పాటు చేసుకున్నామని 1 లక్షా 60 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు.

ఆలయాల అభివృద్ధి లో సిద్దిపేట ఆదర్శం

సిద్దిపేట నియోజకవర్గం ఆలయాల అభివృద్ధి లో అద్వితీయమని మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట ఉమా పార్థివ కోటి లింగాల ఆలయం లో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 లక్షల తో నిర్మించే ధ్యాన మందిరం ఫంక్షన్ హల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ టెస్టు కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-ములుగు

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న 10వ తరగతి మోడల్ టెస్టు పోస్టర్ ని ములుగు మం డల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి సర్ ఆవిష్కరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి సార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకి సిద్ధం అవుతున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు మార్చి 1 న నిర్వహిస్తుందన్నారు, టాలెంట్ టెస్టు ను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవలన్నారు. పోరాటాలు, ఉద్యమాలు కాకుండా విద్యార్థుల ప్రతిభను గుర్తించడంలో కూడా ఎస్ఎఫ్ఐ ముందు వుం టుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రైస్ మనీ మండల స్థాయిలో బహుమతులు ఉంటాయన్నారు, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టులో అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గజ్వేల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నాచారం శేఖర్, రసమల్ల నవీన్ మండల నాయకులు నరేష్, మణికంఠ, చింటు, కార్తిక్, నాయకురాళ్లు మనసా,ఆయిశ, ఆస్మా, ఋతిశ తదితరులు పాల్గొన్నారు.

జేపీ తండాలో పనులను తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండ లంలోని జేపీ తండా గ్రా మంలో చేపట్టిన పనులను ట్రైనీ కలెక్టర్ ఫైజా అహ్మద్ మంగళవారం తనిఖీ చేశా రు. తండాలో ఇప్పటివరకు జరిగిన పనులను జరుగు తున్న పనులను పరిశీలించారు. తడి చెత్త పొడి చెత్త,వర్మి కంపోస్టు గురించి ప్రజలను అడిగారు. వైకుంఠధామం. డంపింగ్ యార్డ్ పల్లె ప్రకృతి వనం, అంగన్వాడి, మన ఊరు మనబడి గ్రామపంచాయతీ,ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ బిక్షపతితో కలిసి మాట్లాడారు.ఉపాధి హామీలో తవ్విన బావులను, కల్లాలు పరిశీలించారు. శ్రమదానం, వాటర్ ట్యాంక్ గ్రామంలో జరుగుతున్న అన్ని పనులను పరిశీలించారు. చిన్న గ్రామపంచాయతైన, జేపీ తండా మంచిగా అభివృద్ధి చెందుతుందని ప్రజలందరి భాగస్వామ్యంతో అభివృద్ధి జరుగుతుందని మంత్రి తన్నీరు హరీష్ రావు సహకారంతో మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని ప్రజలు తెలిపారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎంపీపీ



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు దూళ్మిట్ట మండలం లోని సమస్యలను పరిష్కరించాలని మంత్రి హరీష్ రావును మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి మంగళవారం కలిశారు ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావును మద్దూరు దూళ్మిట్ట మండలంలోని సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు దూళ్మిట్ట మండల కేంద్రం నుండి బైరాన్ పల్లి, లింగాపూర్ నుండి గాగిల్లాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగులపై నిర్మించిన చెక్ డాం క్యావేజీలు వర్షాలకు దెబ్బతిన్నాయని వాటిని మరమ్మతులు చేయించాలని మంత్రిని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు అదేవిధంగా బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరడంతో 50 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు మద్దూరు దూళ్మిట్ట మండలంలోని సమస్యలు పరిష్కరించి నిధులు మంజూరు చేసినందుకు మంత్రి హరీష్ రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మి సాగర్, దూళ్మిట్ట సర్పంచ్ దుబ్బుడు దీపిక వేణుగోపాల్ రెడ్డి ,లింగాపూర్, తోర్నాల, రేబర్తి గ్రామాల సర్పంచులు ముక్క కనకయ్య తాళ్లపల్లి రాజమ్మ నాంపల్లి సవిత చంద్రశేఖర్, నాయకులు బాల్ తదితరులు ఉన్నారు

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి.



నవ తెలంగాణ
కొమురవెల్లి

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం రెడ్ బుక్ డే ను పురస్కరించుకొని సీపీఎం కార్యాలయంలో విప్లవ కెరటం భగత్ సింగ్ అనే పుస్తకాన్ని పార్టీ సీనియర్ నాయకులు నక్క యాదవ రెడ్డితో కలసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భగత్ సింగ్ పుస్తకాన్ని సీపీఎం కార్యకర్తలందరూ పఠించాలని మతోన్మాద, కార్పొరేట్ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మత విద్వేశాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని అన్నారు. రెడ్ బుక్ డే లక్ష్యాలతో మానవీయతను నిలబెట్టాలని నేడు ఎదురవుతున్న సవాళ్ల పట్ల అవగాహన పెంచుకొని సైద్ధాంతిక అధ్యయనం చేయాల్సిన అవసరముందని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, నాయకులు తాడూరి మల్లేశం, బక్కెల్లి బాలకిషన్, తడకపల్లి శ్రీనివాస్, మేకల కృపాకర్, తాడూరి నరేష్, దాసరి మహేష్, నూకల శ్రీనివాస్. రామ్మి, శ్రవణాచారి తదితరులు పాల్గొన్నారు.